# మిసిమి

మాస పత్రిక

ఏప్రిల్ - 2003



రూ. 8/-



వుడయార్

## చిత్రకారుని గురించి

1938లో పశ్చిమ గోదావరి జిల్లా నత్తారామేశ్వరంలో కాశీపండితులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులైన దేవగుప్తపు సత్యలింగ వుడయార్, భద్రమాంబ దంపతులకు జన్మించిన వుడయార్జీ డిగ్రీ అనంతరం 1959లో విశ్వకవి రవీంద్రుడు స్థాపించిన శాంతినికేతన్‌లో చేరి ఎనిమిది సంవత్సరాలపాటు పద్మభూషణ్ నందలాల్ బోస్, రాంకింకర్‌జైజ్, పద్మశ్రీ రాధాచరణ బక్షి వంటి ఉద్దండులైన గురువుల వద్ద చిత్ర శిల్పకళలు అభ్యసించి ఫైన్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌లో డిప్లొమా పొందారు.

**ముఖ చిత్రం : మేఘ సందేశం**

మూడు, నాలుగు టైటిల్స్ కూడా వుడయార్జీ చిత్రించినవే.

పూర్తి వ్యాసం 109వ పేజీలో



క్లేమోడల్

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 14 ఏప్రిల్ 2003 సంచిక 4

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

చెల్లాచెదురైన ఆత్మ - అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

డెన్మార్క్ సమకాలీన జీవన చరిత్ర - సి.ఎల్.ఎల్. జయప్రద

చిత్ర, శిల్ప కళల్లో సవ్యసాచి - డా॥ వుడయార్ - కళాసాగర్

కుల నిర్మూలనను మిథ్యగా భావించిన ఒక బ్రాహ్మణుడి ఆత్మ కథ - టి. రవిచంద్

అత్యధిక ఉష్ణోగ్రతలు - వినియోగ విధానాలు - సి.వి. సర్వేశ్వర శర్మ

యుగయుగాలుగా రూపాంతరం చెందిన శకుంతల - బి.వి. రామిరెడ్డి

హిందూయిజం-ఒక పరిశీలన - డా॥ ఎన్. ఇన్నయ్య

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **మేఘసందేశం**

చిత్రకారుడు : **డా॥ డి.ఎస్.ఆర్.ఎస్. వుడయార్**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# Form IV (SEE RULE 8)

## Statement about ownership and other Particulars of MISIMI

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 2. Periodicity of its Publication | : | Monthly |
| 3. Printer's Name | : | Alapati Bapanna |
| Whether citizen of India | : | Yes |
| If foreigners, state the country of origin | : | |
| Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 4. Publisher's Name | : | ALAPATI BAPANNA |
| Whether citizen of India | : | Yes |
| If foreigners, state the country of origin | | |
| Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 5. Editor's Name | : | ANNAPAREDDY VENKATESWARA REDDY |
| Whether citizen of India | : | Yes |
| If foreigners, state the country of origin | | |
| Address | : | 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital | : | Kala Jyothi Process Limited 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. Cross Roads, Musheerabad, Hyderabad - 500 020. A.P. |

I, ALAPATI BAPANNA, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
**ALAPATI BAPANNA**
Publisher

Date : April 1, 2003.

# చెల్లాచెదురైన ఆత్మ

- అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

ఇక్కడ ఆత్మ అంటే నా ఉద్దేశం, మరణానంతరం దేహం నుంచి దేహానికి పయనించే వేదాంతుల ఆత్మకాదు. ఆంగ్లంలో self, లేదా personalityలకు తెలుగులో సరైన పదం లేని కారణాన 'ఆత్మ' పదాన్ని ఉపయోగిస్తున్నాను. తెలుగులో 'మూర్తిమత్వం' అనే పదం ఉందికాని అది జనానికి అంత పరిచితం కాదు. ఈ మధ్య ''విజయానికి మెట్లు'', ''వ్యక్తిత్వ వికాసం'' రాసేవారంతా మూర్తిమత్వం (personality), వ్యక్తిత్వం (individuality) లకు తేడా తెలియకుండానే రాస్తున్నారు.

ఒక అధ్యక్షుడు రోడ్డుప్రక్కన ఉన్న పిల్లవాణ్ణి ఎత్తుకొని ముద్దుపెట్టుకొంటాడు. ఒక ముఖ్యమంత్రి రోడ్డు ప్రక్కన గ్రామీణునితో కలిసి భోజనం చేస్తాడు. ఒక క్లింటన్ గ్రామీణులతో నృత్యం చేస్తాడు. మరొక సోనియాగాంధీ ప్రజలకు అద్భుతమైన ఉపన్యాసం ఇస్తుంది. ఈ చర్యలన్నీ వారి వారిపాత్రల నిర్వహణలో భాగాలే. ఈ వేషాలు, ముసుగులు పైపైవే. ఈ ముసుగులకు వారి అసలు జీవితాలకు ఎంతో దూరం ఉంది. ఈ ముసుగులన్నీ కావాలని జాగ్రతగా, జనంలోకి వారి ప్రతిమ (image) మంచిగా చొచ్చుకు పోవాలని తయారు చేసినవి. మనకు తెలుసు ఈ ముసుగులన్నీ, ఆటలన్నీ సమాజం కోసం వారు ఆడుతున్న నాటకాలని, వారి అసలు స్వరూపాలు, ఆత్మలు వేరని. అయితే గమ్మత్తు ఏమిటంటే, ఈ ఆటే, ఈ ముసుగే అసలు స్వరూపాలని వీటికి మించి వేరే అసలు ఆత్మ అంటూ లేదని నమ్మడం మొదలైంది. అంటే మనం ఆధునికానంతర చేతనంలోకి ప్రవేశించామన్నమాట. లోగడైతే అసలు ఆత్మకు ముసుగుకు 'దూరం' ఎక్కువైతే, అతడు రోగిష్టి అని, అతడు చికిత్స చేయించుకోవాలని భావించే వాళ్ళం. అసలు ఆత్మ స్థిరమైనదని, దానినే అంటి పెట్టుకోవాలిగాని, ఈ ముసుగులను వేసుకోరాదని అనుకొనే వాళ్ళం. ముసుగుల వాళ్ళను హీనంగా చూసేవాళ్ళం. They are not true to themselves అనేవాళ్ళం. ఆత్మ ద్రోహులనే వాళ్ళం.

కాని నేడు పరిస్థితి మారింది. ఈ ఆధునికానంతర కాలంలో ముసుగునే 'అసలు'గా భావిస్తున్నాము. ఇప్పుడు సనాతన స్థిర ఆత్మ, నిబద్ధతను, విలువలను ప్రశ్నించడంలో దోషం ఏమీ లేదనే భావిస్తున్నాం. నిజంగానే అటువంటి సనాతన స్థిర ఆత్మ, విలువలు, నిబద్ధతలకు చాలా పరిమితులున్నాయని గ్రహించారు. ప్రతిదీ సుసంగతంగా, పొందికగా, అమరినట్లుగా, వ్యవస్థీకృతంగా, అధికారికంగా ఉండాల్సిన అవసరం గూడ ఏమీ లేదని భావిస్తున్నాం.

ఒక కాలంలో సనాతన స్థిర ఆత్మను కోరుకునేవారు. దానికి ముసుగు లేదు కాబట్టి అతడి అసలు స్వరూపం తెలిసేది. అతడి ప్రవర్తనను ఊహించ వీలయ్యేది. భద్రత, సుసంగతత్వం ఉండేవి. దీర్ఘకాలిక నిబద్ధతలుండేవి. అటువంటి జీవితం ఎంతో హాయి.

కాని మనం ఆ కాలంలో నివసించడం లేదు. ఈ కాలం వేరు. ముసుగుల కాలం. స్థిర తాదాత్మ్యాలు (identity, ఆత్మలు) పోయాయి. దీర్ఘకాలిక నిబద్ధతలు పోయాయి. అయితే ఈ ఆధునికానంతర కాలంలోగూడ, మన అదృష్టం బాగుంటే, ''ఇతరుల తోడి మనకున్న అవశ్యక సంబంధితత్వం (relatedness)"ను కనుక్కోవడం ద్వారా భద్రతను పొందవచ్చు.

ఈ విషయాలను చర్చించడానికి ముందు ''కేంద్రీకృత తాదాత్మ్యం'', ''కేంద్రీకృత (స్థిర) ఆత్మ'', ''కేంద్రీకృత సారం'' ఎలా రూపొందుతుందో తెలుసుకోవాలి.

మన మూర్తిమత్వాన్ని మూర్తిమత్వంగా చెదిరి పోకుండా స్థిరంగా, ఒకటిగా, ఐక్యంగా ఉంచే కారకాలు ఏవి? మన మూర్తిమత్వానికి ఒక దిశా నిర్దేశం చేసేవి ఏమిటి? ఈ ప్రశ్నకు మనం సమాధానం సంస్కృతి నుంచి రాబట్టవలసిందే. మన సంప్రదాయంలో స్థిత ప్రజ్ఞుడు, ఆడిన మాట తప్పని వాడు, నిబద్ధత కలిగినవాడు, ఎలా పడితే అలా ఊగిసలాటలాడనివాడు - వీరందరికీ గౌరవం ఎక్కువ. ప్రతివారూ వారినే అనుకరించాలను కొంటారు. (Tradition) పాశ్చాత్య సంస్కృతిలో ఇటీవలి కాల్పనిక సంప్రదాయం (romanticis) గూడ మనుషుల స్థిర తాదాత్మత కేంద్రం రూపొందడానికి దోహదం చేసింది. షెలీ, కీట్స్, బైరన్, బెథోవెన్‌లు, కళాకారులు, తత్వవేత్తలు అందరూగూడ రొమాంటిక్ సెల్ఫ్ (romantic self) ను నిర్మించారు. ఉపరితలం ఎలా ఉన్నా చేతన అంతర్ కుహరంలో కాల్పనికాత్మ గడ్డకట్టింది.

దీనినే కొంతమంది ఆత్మ అన్నారు, వికారాలన్నారు. దానినే దయ్యాలన్నారు. దేవతలన్నారు. ఈ గర్భకుహరమే సృజనాత్మతకు, ఉత్సాహానికి, ఆశంసకు, మేధావితనానికి, నైతిక స్థిరతకు, ధైర్యానికి మూలం. కాల్పనిక సంప్రదాయ కవులు, కళాకారులు అటువంటి ఆత్మను పెంచి పోషించకపోతే, ఫ్రాయిడ్ అచేతన ఘర్షణలను, యూంగ్ (Jung) మూల రూపాల (archytypes)ను గురించి, ఆధునికులు ఆత్మయథార్థీకరణాన్ని (self-actualisation) గురించి మాట్లాడగలిగి ఉండేవారుకారు. అయితే ఆధునికులకు కాల్పనిక వాదం చల్లారి పోయింది. సనాతన ఆత్మ చెల్లా చెదురైంది. కారణం ఆధునిక వాదం ప్రకారం పారిశ్రామికీకరణ, యుద్ధాలు, శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానాలు ఆత్మను గుల్ల చేశాయి. అంటే గర్భకుహరం నుంచి బయటికివచ్చి వ్యక్తి ప్రాతిపదికగా అతడికి కావలసినవి ఏమిటో చూసి, సాంకేతిక జ్ఞానం అందించిన అద్భుతాలతో ఆధునికుడు ఆదర్శ రాజ్యం గురించి కలలుగన్నాడు. మూలాల కోసం హేతుబద్ధ అన్వేషణ ఆరంభమైంది. శాస్త్రీయ నృత్య, సంగీతాలు పోయి కుప్పిగంతుల నృత్యాలు, పాప్ సంగీతాలు వచ్చాయి. ఆధునిక వాస్తు సెంటిమెంట్‌ను వదిలి, ఉపయోగాన్ని పైకెత్తు కొంది. ఈ విధంగా ఆధునికత 'ఆత్మ'ను పునర్నిర్వచిండంతో, మార్మిక ప్రక్రియతో గూడిన అంతర్గర్భకుహరాన్ని వదిలి ''ఇప్పుడు - ఇక్కడ'' (now and here)ల మానవ చేతన మీద కేంద్రీకరిస్తున్నాడు మానవుడు.

కాల్పనికుడు నాటకాన్ని, రాగాన్ని, గాఢతను మానవుని అస్తిత్వ కేంద్రంలో నిలిపితే, ఆధునికుడు కార్యదక్షతను, స్థిర, స్నిగ్ధ ప్రకార్యతను, లక్ష్యదిశా ప్రగతిని ఆదరిస్తున్నాడు.

కాల్పనిక ప్రేమ శాశ్వతం. దాని కోసం అతడు ప్రాణాలు అర్పిస్తాడు. అతడికది ప్రాణం, జీవం. మరి ఆధునికునికి అది ఒక ప్రతీక. జోడీని ఎంపిక చేసుకోవడానికి ఆధునికుడు కంప్యూటర్ను ఆశ్రయించాడు - ప్రశ్నావళిని తయారు చేసి, దానికి వచ్చే సమాధానాలను బట్టి ఎంపిక చేస్తున్నాడు. ప్రేమ స్థానాన్ని ప్రశ్నావళికి వచ్చే సమాధానాలు ఆక్రమించాయి.

ఆధునిక మనో విజ్ఞాన శాస్త్రవేత్తకు మనిషి అంతరాళంలో ఆత్మ, దయ్యం, శక్తితటాకం, మార్మిక శక్తులు, ఆశంసలు లేవు. మనిషి ఒక 'లోపెట్టు' (in-put), 'వెలి పెట్టు' (out-put) యంత్రం.

అతనిలోకి దేనిని ఎక్కిస్తామో (feed) అదే బయటికి వస్తుంది. మానవ ప్రవర్తనను ముందుగా గ్రహించే సామర్థ్యాలు పెరగడంతో, నియంత్రించే శక్తి పెరగడంతో, మానవ మూర్తిమత్వాన్ని మార్చే, రిపేరు చేసే ప్రోగ్రాములను తయారు చేయవచ్చని ఆధునికులు భావిస్తున్నారు. మంచి కార్లలాగే మంచి మూర్తిమత్వాలను తయారు చేయవచ్చని భావిస్తున్నారు. ప్రవర్తన పరివర్తన పద్ధతుల ద్వారా సంజ్ఞానాత్మక చికిత్స (lognitive therapy) ద్వారా, చెడిన కారును మెకానిక్ ఎలా బాగుచేస్తాడో, మనో విజ్ఞాన శాస్త్ర వేత్త అలాగే బాగు చేస్తాడు. ఆధునికుడు ఆత్మను నిర్వచించే విధం ఇది.

కాలం మారుతూ ఉంటుంది. అంటే విలువలు మారుతూ ఉంటాయి. ఈ క్రమంలోనే ఆధునిక వాదానికి కాలం చెల్లింది. అది కుప్ప కూలింది. నూతన సాంస్కృతిక పోకడలనదగిన లక్షణాలు చోటు చేసుకొన్నాయి. ఇవి ఆధునికానంతర వాదాన్ని నిర్వచిస్తున్నాయి. ఫలితంగా సుసంగతమైన, గుర్తింపదగిన, సూత్ర నిబద్ధమైన ఒక సారం, మనం పైకి కన్పింప జేసిన ముసుగు వెనుక, ఉందనే నమ్మకం బీటలు వారింది.

ఈ ఆధునికానంతరవాదం ఆవిర్భవించడం వెనక ఉన్న చాలక శక్తి ఏది? మన సామాజిక సంబంధాలను వివిధంగా మార్చి వేసిన సాంకేతిక శాస్త్రం దీని వెనక ఉన్న శక్తి. టెలిఫోన్, ఆటో మోబైల్, రేడియో, టెలివిజన్, చలన చిత్రం, ప్రచురణ, జెరాక్స్, కాసెట్ రికార్డింగ్, నగర జనాభా రవాణా, శాటిలైట్ ప్రసారం, జాతీయ రహదారి వ్యవస్థ, వి.సి.ఆర్., కంప్యూటర్, ఫాక్స్, మొబైల్ టెలిఫోన్ - గత నలభై యాభై సంవత్సరాలుగా సమాజాన్ని కుప్ప తెప్పలుగా ముంచెత్తి, మామూలు సమాజ జీవితాంతర్భాగాలయ్యాయి. ఫలితంగా సామాజిక సంబంధాల పరిధి పెరిగింది. లోగడవలే మన జీవితం ఏ చిన్న గ్రామానికో, నగరానికో బందీ కాదు. అనేక రకాల అభిప్రాయాలకు, జీవిత విధానాలకు, మూర్తిమత్వాలకు, విలువలకు గురి చేయ బడుతున్నాము. అంటే సామాజిక బంధాలు ''ప్రేలుడు'' (explosion)కు గురి అయ్యాయి.

మరి ఈ సంబంధాల 'ప్రేలుడు' మన ఆత్మను (self) భావించే తీరును, దానిని మనం అర్థం చేసుకొనే తీరును ఎలా మార్చింది? మొదటిగ ఆత్మజనీకరణం (Populating of the self), అంటే ఇతరులను మన ఆత్మలో నింపడం, ఆత్మలోకి పీల్చుకోవడం (absorption of others). అసంఖ్యాకంగా ఇతరులకు గురికావడం వల్ల మన అవగాహనల, చర్యావకాశాలు (action posibilities) గుణావగుణ వివేచనల పరిధి పెరుగుతుంది. స్నేహితుల, పరిచయుల, కుటుంబ సభ్యుల, భావ ప్రసార మాధ్యమం ద్వారా మన అస్తిత్వా (being)నికి సంబంధించిన అనేక సంభావ్యతలను వాటి విరుద్ధాలను చూస్తాము, సంవేదిస్తాం (feel). స్వలింగ సంపర్కాన్ని, విలింగ సంపర్కాన్ని, - రెండింటిని పరిహరించడానికి, పరిగ్రహించడానికి కావలసిన హేతువులను మనం ఏ కరువు పెట్టగల స్థితిలో ఉన్నాం. బహు సంపర్కాన్ని కాదనగలం, అవుననగలం. ఏది రైటో, ఏది కాదో తేల్చుకోలేని స్థితిలో ఉన్నాం. రెండింటిని అంగీకరిస్తాం. అంగీకరించం. ప్రతిదీ ఆయా సందర్భాన్ని బట్టి రైటవడం, తప్పవడం జరుగుతుంది. మరి ఈ ''మిశ్రమం'' (విలువల కలగా పులగం) లో మన నిజమైన, అధికారిక ఆత్మ (మూర్తిమత్వం) ఎక్కడ? వాల్ట్‌విట్‌మన్ మాటల్లో చెప్పాలంటే మనలో ''బహుళాలు'' (multitudes) ఉన్నాయి.

కేంద్రీకృత, ఐక్యీకృత ఆత్మ బహుళ సామాజికుల (బహుళ శ్రోతల, ప్రేక్షకుల) కోసం చిన్నాభిన్నమై కుప్పకూలి పోతోంది. ఉదాహరణకు ఒకసినిమాలో, తన కూతురు జన్మదిన వేడుకలో, తన పెద్ద విశాల భవనంలో అటు ఇటు పరుగులు తీస్తాడు తండ్రి మంచి ఆతిథేయుడుగా కూతురు స్నేహితులయెడ ప్రవర్తిస్తాడు. మళ్ళీ వెంటనే, ఆ కూతురు మిత్రులను వదిలి, తనను శంకించే భార్యను సంతోష పెట్టడానికి అక్కడకు పరుగులు తీస్తాడు. మళ్ళీ ప్రక్క గదిలో ఉన్న తన రౌడీ స్నేహితులకు దర్శనమిస్తాడు. మళ్ళీ వెంటనే కూతురు పార్టీ వైపుకు పరుగులు తీస్తాడు. మనం అతన్ని చూసి జాలిపడతాం, అసహ్యించుకొంటాం, నవ్వుకొంటాం. అదే సమయంలో మనం మన జీవితాలకు అలా ప్రతి స్పందించుకొంటాం. సామాజీకీకరించే ఈ సాంకేతిక శాస్త్రాలు విరుద్ధ ఆచరణలతో గూడిన పెద్దభవనాన్ని మనకోసం నిర్మిస్తున్నాయి.

పాపం ఆధునికానంతరుడు - వీణ్ణి చూసి మనం జాలి పడాలి. ఒక ప్రక్క కుటుంబానికి అంకితం కావాలి. అదేసమయంలో వృత్తి బాధ్యతలకు న్యాయం చేయాలి. మృదువైన, రొమాంటిక్ సంవేదనలను ప్రదర్శించాలి. ఇంకా అతడు ఆటలలో, రాజకీయాలలో, సాఫ్ట్‌వేర్‌లో, షేర్ల మార్కెట్‌లో, యంత్రాలు నడపడంలో, ఆహారం పానీయాలలో నిపుణుడై ఉండాలి. మిత్రబృందాన్ని సంపాదించుకోవాలి. రోజూ వ్యాయామంతో ఆరోగ్య ప్రణాళికను అమలు చేయాలి. తగిన సిడిలను తెచ్చుకోవాలి, సెలవులు ఎక్కడ ఎలా గడపాలో ప్రణాళిక వేసుకోవాలి. నలుగురు మెచ్చే వారుంటే మరీ మంచిది. ఇవన్నీ అతడు చేయాలి - ఈ సంశ్లిష్టత, సంక్లిష్టత నిరంతరం పెరిగే ఈ ప్రపంచంలో జీవితం కొనసాగించాలంటే. మన్పై ఉదాహరణలో మనిషి అటు ఇటు పరుగులెత్తినట్లుగా ఆధునికానంతరుడు పరుగులు తీయాలి వేషం మారుస్తూ, దృక్పథాలను మార్చుకొంటూ, తీవ్రతలను తగ్గిస్తూ, పెంచుతూ పాత విలువలను వదిలి, కొత్తవిలువలను కౌగిలించుకొంటూ.

సామాజికీకరణ సాంకేతిక శాస్త్రాలు మన ఆత్మ కేంద్రాన్ని, సారాన్ని, ఐక్యతను దెబ్బతీసే మరో విధం ''ప్రతిమల పునరావృత్తం'' (Repetition of images). ప్రేమ వ్యవహారమే తీసుకోండి. పూర్వం ప్రేమా, రాగం, వాంఛలంటే అవి ప్రాథమిక 'ఆత్మ' యొక్క అయత్న అభివ్యక్తీకరణలుగా ఉండేవి. అవి ఆత్మ కుహరం లోంచి బయటకు పగలగొట్టుకు వచ్చేవి. కాని మనం ఈ రోజుల్లో వాటిని సినిమాల్లో, టి.వి.లలో, పుస్తకాలలో ఎన్నోసార్లు గమనిస్తున్నాము. నీకు ఆ మాటలన్నీ తెలుసు. కళ్ళు ఎలా కదలుతాయో తెలుసు. నోరు ఎలా చలిస్తుందో నీకు ఎరుకే, కవలికలు, ఆసనాలు అన్నీ నీకు పదే పదే దర్శనమిస్తున్నాయి. ఈ రకంగా 'ప్రతిమలు' పదే పదే పునరావృతమయ్యే సరికి, 'అసలు' నీరు కారిపోతుంది. పల్చనైపోతుంది. సారం (substance) శైలి (style)గా మారుతుంది. ఇహ ప్రేమలోని నిజాయితీ మీదనమ్మకం పోతుంది. గొంతులో మాటలు గొంతులోనే గురుగురలాడతాయి. పునరావృత్తం అలాగే కొనసాగితే సత్యం (నిజం) ఒక అందాల కళాత్మక కథనంగా మారి పోతుంది. ఇది మన సమకాలీన జీవితం మీద విషాదపూరిత వ్యాఖ్యానం తప్ప మరేమీ కాదా? పూర్తిగా అలాకాదు. విషాదానికి చోటులేదని మనం అనం, ఎప్పుడు? అంతరంగ మార్మికతలను, రాగ విరాగాలను, ఆవేశాంశంసనలు నమ్మినప్పుడు; మన జీవితాలకు మనం కర్తలం కాదని విశ్వసించినప్పుడు, మనం వేటికి ప్రతీకలమో, మన విలువ లేమిటో, మనం ఎటు పోతున్నామో, ఎక్కడకు పోతున్నామో

తెలియనప్పుడు; విస్తరిస్తున్న సంబంధాలు ప్రశాంత దినాలను గందరగోళంలోకి మారుస్తున్నప్పుడు, అత్యంత సాన్నిహిత్యం అలవాటుగా, నిత్య కర్మగా మారినప్పుడు, నిబద్ధత గతమైనప్పుడు.

అయినా ఇటువంటి స్థితికి మనం కనీసం వగపు చెందుతున్నామంటే గతంలోని ( ఆధునికత, అంతపూర్వ) మూలాలను మరవ లేదన్న మాట. మన గర్భకుహరాలలో బంధాలు తెగిపోతే, ప్రేమ, రాగాలు ఏమై పోయినా మనం పట్టించుకొనేవారమా? అవి నేడు అంతర్ధాన మవుతున్నాయని వగచేవారమా? మనం ఆధునిక యుగానికి చెందిన హేతుబద్ధ వ్యవస్థీకృత జీవితాన్ని పట్టుకొని వేళ్ళాడక పోతే, నేటి గందరగోళం గందరగోళం అని పించేది కాదు.

మనం నేడు అనుభవిస్తున్న వేదనను మన పిల్లలు అనుభవించరు. అసలు ఎందుకు ఎవరైనా ఆ నిజమైన, వాస్తమైన, అంతర్గత ఆత్మల గురించి అంత ఫస్ చేయడం దేనికి అని వారు ప్రశ్నిస్తారు. వారికి గతం లేదు, వారు పుట్టడమే సాంకేతికశాస్త్రాల ''మీద'' పుట్టారు. ''తో'' పుట్టారు. ''జీర్ణించు''కు పుట్టారు. ఇహ సంస్కృతీ చక్రం వెనక్కు తిరగదు.

మనం ఆధునికానంతరతను కేవలం ఒక అరిష్టంగా చూడ నవసరం లేదు. పెరుగుతున్న, విస్తృత మవుతున్న సాంకేతిక శాస్త్రం కారణంగా మానవ వికాసానికి సంభావ్యతలు గూడ పెరుగుతున్నాయి. ప్రతి నూతన సంబంధం ఏక కాలంలోనే అంతరంగాభి వ్యక్తికి ఒక అవకాశం, నిపుణతకు, గుణావగుణ గ్రహణానికి తెరిచిన ద్వారం.

ఈ విషయం మనం నేటి యువతులను చూస్తే అర్థమవుతుంది. ఒకప్పుడు ఆదర్శ మహిళ అంటే తల్లి - భార్య - ఈ నమూనాతోనే స్త్రీలందరు తమను మూల్యాంకనం చేసుకోవలసి వచ్చేది. మరొక నమూనా లేదు. కాని నేడో ఆ ప్రతిమ అనేక నమూనాలలో ఒకటి. కాని నేడు అటువంటి మోడల్స్ లేక పోయినా, నేటి యువతి అనేక పనులు చేస్తున్నది. పోటీ పడుతున్నది. పోటీలో ఒక ఉద్విగ్నత పొందుతున్నది. ఇది మూర్తిమత్వం మీద ఒక ముద్రవేసినా, ఒక ముడత వేసినా, అది నూతన కొలతయే. కొన్ని మంచి క్షణాలు తేలిపోయే అనుభవాలనిస్తున్నాయి. కొన్ని ఆశ్చర్యాన్ని గొలిపేవి- ''నేను ఎంత చేయగలనో, ఏమి చేయగలనో చూడండి. నేను ఏమి కాగలనో, చూడగలనో, సంవేదించగలనో, తెలియగలనో చూడండి.'' ఇలా తేలిపోయే క్షణాలలో ఆ స్థిర ఆత్మ, సుసంగతాత్మల గురించి ఎవడికి కావాలి? ఆ ఆత్మ వెనక - ఆ యువతి చేసిన వాటి వెనక - ఏముంటే ఎవరికి కావాలి. నాటకం సాగుతూనే ఉంది. అదే అంతా.

కంప్యూటర్లు వచ్చినా యంత్రాల సహాయం ఉన్నా మనకు వ్యవధి లేదు. మన తాతలకు, సాంకేతిక జ్ఞానం పెరగని రోజుల్లో అంతా విరామమే. మనం నేడు ఎంత చక చకా పనిచేసినా 24 గంటలు చాలడం లేదు. ప్రతిక్షణము నిమగ్నులమై ఉంటున్నాము. అటువంటి నిమగ్నత ఆత్మకు కొత్త ముఖాలను తెచ్చి పెడుతుంది. గతాన్ని నెమరు వేసుకోనిస్తుంది.

గత కాలంలో అయితే నిజమైనదీ, వాస్తవమైన దానితోనే వ్యవహరించాలి. ''నేను నిజంగా ఫీలయ్యేది ఇదేనా, నేను అనుకొనేది నిజంగా ఇదేనా? నేను ఎవరిని?'' అనే ప్రశ్నలు వేసుకొనేవారు. వాటికి సమాధానం కనుక ''కాదు'' అని వస్తే ఆ పనులు మానివేయడం, ప్రణాళికలు తిరగరాయడం జరిగేది.

ఇప్పుడు ఆ ప్రశ్నలు మనం వేసుకొని తీరాలా? వేసుకొని తీరాలని నియమం ఏమీ లేదు. అక్కడ లోలోన అంతరంగ గర్భంలో, ఏవో ప్రమాణాలున్నాయని, తర్కం ఉందని, అంతస్సారముందనీ, వీటితో మనం చేసే ప్రతిపనీ తావిళ్ళు వేయాలనీ మనం అనుకోక పోతే, మనకు విముక్తి లభిస్తుంది. ఆధునికానంతర జీవితం అందించే ఆటలన్నీ ఆడ వచ్చు.

ఆధునికానంతర సంస్కృతి ఆత్మాభివ్యక్తీకరణకు మంచి అవకాశాలు కల్పిస్తుంది. ఆధునిక జీవితం ఆత్మను హేతు బద్ధం చేసింది, వస్త్వాశ్రమం (objective) చేసింది. ఇప్పుడది గతం. ఆధునికానంతరాత్మ ''ఆత్మ కేంద్రకం'' (self - centred) కాదు. స్థిర, సుసంగత, కేంద్రీకృత ఆత్మను ఈరోజు 'పేరాస' (greed) స్వార్థం, అతి గర్వాలతో జమ కడుతున్నారు. ''నాది వేరే ప్రత్యేక ఆత్మ అయితే, నేను నీ బాగుకంటే నా బాగును చూసుకోవాలి'' అనే తర్కం వస్తుంది. కాని సామాజీకరణ సాంకేతిక శాస్త్రాలు రావడంతో ''ప్రత్యేక ఆత్మ'', వ్యక్తిగత - స్వీయ నిర్దేశ ఆత్మలు'' పడిపోయాయి. మనం ఈ నాడు రాను రాను ఒక విషయాన్ని అర్థం చేసుకొంటున్నాము: ''మన అభి వ్యక్తీకరణలు, విశ్వాసాలు, విలువలు, ఆలోచనలు, వాంఛలు ఇతర వ్యక్తుల నుంచి వచ్చే దానాలు. వెళ్తూ వెళ్తూ ఇచ్చే చిన్న చిన్న బహుమానాలు.''

ఈ అభివ్యక్తీకరణలు పునశ్చరించనవసరం లేదు. మనం అన్యులం. ఈ అన్యత ఆత్మనిర్దేశితం కాదు. మన సంబంధాల ప్రత్యేక నమూనాను ప్రతిబింబిస్తుంది. ''నాలో ఉన్న నీవు నేను'', ''నీలో ఉన్న నేను- నీవు'', ''మనం ఐక్యం అయ్యాము'' అనేది ఎవ్వరైనా యథార్థం చేసుకోవచ్చు. ఈ రకమైన చేతనం ఉదయించడంతో స్వార్థం సంతోషాన్ని ఇవ్వదు. ఎవరి ప్రతిమను ప్రక్షేపించుకోవడానికి వారే, ఎవరి స్వార్థానికి వారే పూర్తిగా పనిచేస్తే, నీకు నేను వ్యతిరేకంగా పనిచేస్తే, అప్పుడు నేను పూర్తిగా సుఖసంతోషాగ్నికి, బీజశక్తులను బలం చేసుకోవడానికి, విలువలను పెంపొందించుకోవడానికి దూరుడ నవుతాను. నేను గత సంబంధాల అధారంగానే జీవిస్తే, క్రమంగా ''నేను'' అనేది ఒడబడి ఎండిపోతుంది. అలిసి పోతుంది.

మనం ఆత్మకుహరం నుంచి బయటపడి, బాహ్య సంబంధాల వైపు నడిస్తే, ఒక రకం కొత్త ఆశావాదం మోసులెత్తుంది. మనం 'ఘర్షణ' ప్రపంచంలో ఉంటాం. ప్రతి సమూహం తాము స్వతంత్రులమని, ఏకైకులమని, తమ హక్కులకు, విలువలకు, సంక్షేమానికి కట్టుబడి పనిచేయాలని నమ్ముతుంది. ఫలితంగా ఘర్షణలన్నీ సంప్రదాయాను సారంగా ఆత్మను మనం దర్శించిన తీరులోనే నిర్వచించాయి. సామాజీకరణ, సాంకేతిక జ్ఞానం, స్వతంత్ర, ప్రత్యేక ఆత్మలను బద్దలు గొడితే, ఇదే జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో జరిగితే, ఇతర వ్యవస్థలతో, విలువల వ్యవస్థలతో సంస్కృతులతో సంబంధాలు మెరుగవుతాయి. అప్పుడు ఇది 'పలానా దేశ సంస్కృతి' అని చెప్పే అవకాశం ఉండదు.

చివరకు సామాజీకృత సాంకేతిక శాస్త్రాలు విస్తృతి ఇలాగే జరిగితే స్వీయ కేంద్ర విశ్వాస వ్యవస్థ నుంచి ఇతరులతోడి అవిభాజ్య సంబంధాల చైతన్యానికి పయనిస్తాం. బహుశ అప్పుడు మన ఆధునికానంతర ఆత్మలు ఈ భూగోళాన్ని ఇంకా మంచి వాసయోగ్యమైన స్థలంగా మారుస్తుందని ఆశిద్దాం. మత ఛాందసులు కళ్ళు తెరుస్తారని ఆశిద్దాం.

# డెన్మార్క్ సమకాలీన జీవన చరిత్ర

## (1917వ సంవత్సరపు నోబెల్ సాహిత్య పురస్కారోపన్యాసం)

మూలం: స్వెన్ సోడర్మన్, అనువాదం: సి.ఎల్.ఎల్. జయప్రద

డెన్మార్క్‌లోని సమకాలీన జీవనం నిజాయితీగా చిత్రించినందుకు ఈ సంవత్సరం హెన్రిక్ పాన్టోపిడాన్‌కు నోబెల్ సాహిత్య పురస్కారం ఇవ్వడమైనది.

పాన్టోపిడాన్, ఆధునిక డేనిష్ సాహిత్యంలో జార్జ్‌బ్రాంట్, హోల్గర్ డ్రాష్మన్, జె.పి. యాకోబ్ సన్‌లు ముఖ్య సభ్యులుగా జరిగిన సాంస్కృతిక పునరుద్ధరణ తరువాత 1870లలో పేరు పొందిన రచయితల తరం వాడు. రచయితగా ఆయనకు విశేష గౌరవం దక్కించింది చిన్న నవల. మానవ మనస్తత్వ పరిశీలకుడిగా, సమకాలీన నైతిక జీవన చరిత్రకారునిగా ఆయన ఆ కాలం నాటి డేనిష్ రచయితలందరికీ పై స్థాయిలో నున్నవాడే. 1857లో జన్మించిన పాన్టోపిడాన్ గ్రండ్‌లింగ్ ఆశయాల వల్ల ప్రభావితుడైన ఒక ప్రొటెస్టెంట్ మతాధికారి పుత్రుడు. ఆయన ఒక పాలిటెక్నిక్ కళాశాలలో చదివాడు. కొంత కాలం ఒక పాఠశాలలో పని చేసిన తరువాత రచనా వ్యాసంగానికే తన పూర్తి కాలాన్ని వినియోగించ దలిచిన ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. 1881లో తన మొదటి పుస్తకం 'Clipped Wings' (విరిచిన రెక్కలు) వెలువడిం తరువాత ఆయన ఎన్నో పుస్తకాలు, చిరస్థాయిగా నిలచిపోగల గొప్ప పుస్తకాలు రాశారు. డేనిష్ జీవన విధానమూ, ఆ ప్రజల వింత మనస్తత్వం వల్ల ఆయన యవ్వనంలో కొన్ని చేదు అనుభవాలు రుచి చూడటం ఆయన రచనా జీవితంపై చెరిగిపోని ముద్ర వేసింది. ఆత్మ వంచనలపైన, భ్రాంతులపైన, అనిత్యమైన అధికారాలపైన, అభూత కల్పనల మీద, భ్రమలు కలిగించే అందమైన పదాల మీదా, మూఢ నమ్మకాల మీదా ఆయన రచనలన్నీ పోరాటం జరిపాయి. ఇంకో విధంగా చెప్పాలంటే ఇవన్నీ అందమైన భాషలో సాగే క్షీణ ప్రక్రియల లక్షణాలు. ఆయన దృష్టిలో వీటి ద్వారా పాత ప్రపంచం సర్వ నాశనం దిశగా సాగిపోతుంది.

ఆయన 'The Parish of Sandinge'(1883)లో ఉన్నత విద్యా విధానంలో లోటుపాట్లని ఎత్తి చూపించగా, 'Clouds' (1890)లో ఈస్ట్రప్‌లో న్యాయశాస్త్రపు ముసుగులో ఒక వామపక్ష రాజకీయ వేత్త సుతిమెత్తని పసలేని మాటలతో చేసే గారడీలు చూపించాడు. 'The Old Adam'(1894)లో, మరియు 'Songs of Songs'(1896)లో ఊహాప్రేమ ప్రపంచంలోనూ, గొప్ప భావోద్రేకాల్లోనూ పాక్షికంగా ఉన్న సత్యాన్ని చూపించారు. 'Nature'(1890)లో ప్రకృతిని కళల్లో ఉన్నతంగా చూపించటం పట్ల వ్యంగ్య రచన చేశారు. ఎంతో కాలం నుండి సాహిత్యంలో ప్రచారంలో ఉన్న భావనని, ప్రేమ బంధాలలో ఉండాల్సిన నిబద్ధత, పవిత్రతని ఆయన 'A

---

సి.ఎల్.ఎల్. జయప్రద, వాల్తేరు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో, ఆంగ్ల శాఖలో రీడర్‌గా పని చేస్తున్నారు.

Gauntlet'లో ప్రశ్నించారు. 1900లో వచ్చిన ఆయన రచన 'The Ideal Home' వివాహ బంధం కంటే మాతృబంధం గొప్పదని నిరూపిస్తుంది. 'Night Watch' (1894)లో నూ, 'The Wild Chase' (1906)లోనూ ఆధునిక చిత్ర కళా, ఆత్మాశ్రయ కవిత్వం వట్టి విలాస వంతమైన వస్తువులని విమర్శిస్తాడు పాన్టోపిడాన్. జీవితానికి శత్రువైన బలహీనమైన సంస్కృతికి స్వేచ్ఛలో పెరిగే ప్రకృతికి మధ్య వ్యత్యాసాలు కూడా చూపిస్తాడు. ఆయన సాంఘిక, విప్లవ పోరాటాలపట్ల, గతి తార్కిక వాదాలపట్ల సానుభూతి ప్రకటించాడు. అయితే తన గొంతుతో ఆయన ఎప్పుడూ మాట్లాడ లేదు. నాటక రంగంపై ఆయన పాత్రలు స్పష్టంగా తమ గొంతులు వినిపిస్తే, ఆయన రచనల వెనక ఉన్న స్ఫూర్తి మాత్రం విప్లవాలదే. విశేషం ఏమిటంటే ఆయన రచయితగా మాత్రం పుల్లబారుతున్న భావ కవిత్వం పాలు తాగే పెరిగారు. అన్నిటికంటే వింతైన విషయం ఆయన వాస్తవికతాదృష్టి ఉన్న భావకవి కావటం. వాస్తవిక ధృక్పథాన్ని ఊహాజనిత జలతారు ముసుగుల్లో కప్పటం, అదే సమయంలో భావ కవిత్వాన్ని వ్యంగ్య ధోరణితో మిళితం చేయటం అనే పరస్పర విరుద్ధ విషయాలు ఆయన రచనలలో మనకు కన్పిస్తాయి.

పాన్టోపిడాన్ రచనలన్నిటిలో గొప్ప మూడు సంపుటాల్లో 1891-95ల మధ్య వెలువడిన 'The Promised Land'. మొదట ఎనిమిది సంపుటాల్లో తరువాత రెండు పెద్ద పెద్ద సంపుటాల్లో 1905లో వెలువడిన 'Lucky Peter'. ఈ నవల 1860ల తరువాత డెన్మార్క్ అంతర్గత జీవితాన్ని కళ్ళకు కన్పడేట్లు వర్ణిస్తుంది. వీటిలోని మొదటి నవల విస్తృతంగా గ్రామీణ జీవనాన్ని వర్ణిస్తూ రైతులకీ నగర ప్రజలకీ మధ్య ఉన్న వైరుధ్యాన్ని ప్రతిబింబింప చేస్తుంది. ఈ భిన్న వర్గాల ప్రజలను ఏకం చెయ్యాలని ఎంతో నిజాయితీతో చేసే ప్రయత్నాలు కూడా కొంతవరకు విఫలమవటం తప్పదని ఈ నవల చూపిస్తుంది. ఇందులోని ముఖ్య పాత్రైన ఒక కోపెన్‌హాగన్ మతాధికారి తన ధర్మం నిర్వర్తించాలనే తీవ్రమైన కాంక్షతో పామర జనుల జీవితాలని సంస్కరించాలని వారితో కలసి జీవించాలనుకుంటాడు. కాకపోతే సామాన్య ప్రజలపై తాను పెంచుకున్న నమ్మకంలోనూ, మతాధికారిగా తన ధర్మం నిర్వర్తించటం లోనూ, తన ఆదర్శాలని ప్రజల వాస్తవిక పరిస్థితుల కనుగుణంగా మార్చుకోవడంలోనూ మోస పోతాడు, విఫల మవుతాడు. ఫలితంగా వాస్తవ జీవితానికి దూరమైన స్వాప్నికుడిగా మిగిలిపోతాడు. ఇందుకు పూర్తి విరుద్ధంగా లైక్‌ఫేర్ అనే ఒక చిన్న నగరానికి చెందిన ఇంజనీరు, మహానగరంలో సంతోషంగా సరదాగా జీవితం గడపటానికి బయలు దేరతాడు. మతాధికారి లాగా కాక ఈతడు జీవితాన్ని యధార్థ దృష్టితో మాత్రమే చూచే ఆశాజీవి. ఇతనికి మతమన్నా, దార్శనికత అన్నా, కళా దృష్టి అన్నా అయిష్టం. అంతులేని ఉత్సాహంతో ఉరకలేసే ఇతన్ని తను నిర్దేసించుకున్న ఆశయాలను సాధించు కోవటం నుండీ ఏశక్తీ అడ్డుకోలేదు, ఆపలేదు. అయితే అతనికి ఒక స్వేచ్ఛా ప్రియుడికి అవసరమైన తనను తాను నియంత్రించుకునే శక్తి లేదు.

ఫలితంగా తను నిరసించే తన రక్తంలో ప్రవసించే క్రిస్టియన్ స్వాప్నిక దృష్టికి బలైపోతాడు. ఈ పుస్తకంలోని విశిష్టత ఏమిటంటే ఇది జూయిష్, జర్మన్ భావాల మధ్య మౌలికమైన తేడాలు స్పష్టంగా చూపిస్తుంది.

యుద్ధకాలంలో పాన్టోపిడాన్ పూర్తి చేసిన మరొక పెద్ద నవల 'The Kingdom of The Dead'లో 19వ శతాబ్దం చివరలోనూ 20వ శతాబ్దం మొదట్లోనూ రకరకాల డెన్మార్క్ నగర జీవన చిత్రాలు చూపించారు. దీనిలోని వస్తువు స్తబ్దతలో ఉన్న జనాలను మేలుకొలుపాలనే ఒక సంస్కరణాభిలాషగల యువ రాజకీయ నాయకుడు చేసే విఫలప్రయత్నం. ఆసక్తి రేకెత్తించే సాంఘిక జీవన చిత్రణ, జీవంతో తొణికిసలాడే పాత్ర పోషణ ఉన్న ఈ రచన అంతకు ముందు వచ్చిన ఆయన రచనలన్నిటికీ భిన్నంగా ఉంది.

హెన్రిక్ పాన్టోపిడాన్ డేనిష్ యధార్థ జీవన చిత్రిణలో సాంప్రదాయ వాదిగా వర్ణించబడ్డాడు. ఆరోగ్యమైన శ్వాస లాగా లయతప్పని వింతైన శక్తితో మెత్తని శైలిలో ఆయన రాస్తారు. అలవోకగా, సూటిగా, సున్నితంగా నడిచే ఆయన కథనంలో యధార్థాన్ని సజీవంగా చిత్రించగల అరుదైన శక్తి ఆయనకు భగవత్ ప్రసాదితం. ఆయన రచనలలో మనకు ఓటల్లాండ్, రాజధాని నగరం, వ్యాపార నగరం, రాజ ప్రాసాదాలతో నిండిన గ్రామీణ ప్రాంతం, జమీందారులూ, పాఠశాలలూ, పానశాలలూ ఒకటేమిటి డెన్మార్క్ ప్రాంతం మొత్తం మనకు కన్పిస్తుంది. నిజ జీవిత స్ఫూర్తి నుండి ఆయన రచనలు వెలువడినట్లు పాఠకులకు గాఢంగా అన్పిస్తుంది. ఆయన గ్రామీణ జీవితం వర్ణన నేపథ్యం కొరకు మాత్రమేకాక అక్కడ జీవించే వ్యక్తులకోసం, అది వారి జీవితాలని శాసించటం వలన చేస్తాడు. పాన్టోపిడాన్ వర్ణనలల్లో మనిషి, అతని జీవిత లక్ష్యం ప్రాధాన్యత సంతరించు కుంటాయి. మానవ జీవన చిత్రీకరణలో ఆయన అనుపమానమైన కళా దృష్టి కన్పిస్తుంది. వివిధ వర్గాల డేనిష్ ప్రజల గురించి ఆయనకు అవగాహన ఉంది. వారి భాష, పద్ధతులు, అలవాట్లు, ఆలోచనా ధోరణుల గురించీ ఆయనకు పూర్తిగా తెలుసు. తన పాత్రలనుండి రంగుల వర్ణ చిత్రాలు తయారు చేయటంలో ఆరితేరిన ఆయనకు, గాఢమైన వారి అంతర్గత జీవితాల్ని వారి వ్యక్తిత్వాలకు వ్యక్తపరచే విధంగా వర్ణించటం కూడా తెలుసు. వారి రచనలకు పాఠకులకి గుర్తిండి పోయేవి స్పష్టాతి స్పష్టంగా శిల్పంలా చెక్కిన పాత్రలూ, వారి జీవన పరిస్థితులు. డేనిష్ ప్రపంచాన్ని రెండు దశాబ్దాల కాలంలో చూపించిన విశాలమైన రంగమది. మరీ ముఖ్యంగా ఆయన తన రెండు ప్రధాన రచనలూ విశేషమైన వర్ణనలతో రకరకాల భావోద్రేకాలకూ వత్తిడులకూ గురైయ్యేపాత్రల మనస్తత్వ చిత్రీకరణలతో అందమైన సంఘటనల కూర్పుతో ఎంతో రమ్యంగా తీర్చిదిద్దారు. వీటిలో అన్ని వివరాలూ సుస్పష్టమవుతూ, నవలల్లోని వివిధ భాగాలూ అందులోని వివరాలూ సునాయాసంగా ఒక సమతుల్యంగల శిల్పంలా కూర్చ బడ్డాయి. హెన్రిక్ పాన్టోపిడాన్ విస్తృతమైన విషయాలపై అవగాహన ఉన్న మహాకావ్యాలు

స్పష్టించిన, విశేష్మైన కృషితో మహోన్నతమైన శిఖరాలు అందుకోవాలని నిరంతరం ప్రయత్నించే మేధావి.

**జీవిత చరిత్ర**

మాతండ్రిగారు డైన్స్ పాన్టోపిడాన్ ఒక పురాతన మైన మతాధికారుల కుటుంబానికి చెందినవారు. ఆయన కూడా ఒక మతాధికారే. మా తల్లి ఒక ప్రభుత్వాధికారి కూతురు. వారికి పదహారు మంది సంతానం. వారిలో నడిమి వాడినైన నేను 1857 జులై 24న ఓట్‌లాండ్‌లోని ఒక చిన్న పట్టణమైన ఫ్రెడింకాలో జన్మించాను. 1863లో మా నాన్న గారి బదిలీ కారణంగా నా ఆరవ ఏట మేము రాండెర్స్‌కు తరలి వెళ్ళిం తరువాత ప్రశ్యా, ఆస్ట్రియా సైన్యాలు కలసి ఆ పట్టణంపైన దాడి చేయటం నాకు గుర్తే. నా పది హేడవ సంవత్సరంలో నేను కోపెన్‌హేగన్ వెళ్ళి అక్కడ పాలిటెక్నికల్ కాలేజీలో చేరాను. ఒక వేసవి కాలం స్విట్జర్ లాండ్ వెళ్ళటం వల్ల అక్కడ ప్రకృతిలో అనుభవానికి వచ్చిన గొప్ప అనుభూతుల స్ఫూర్తితో రచనా వ్యాసంగం మొదలు పెట్టాను. మొదట్లో నా దృష్టి ప్రకృతి వర్ణనలపైన, పామర జీవనంపైన ఉండేది. కాలక్రమేణా మానవునిలోని వైరుధ్యాలను చిత్రించటమే నాకు ప్రధానమైన లక్ష్యంగా మారింది.

నా మొదటి పుస్తకం 1881లో వెలుగు చూపింది. మొదట్లో చిన్న చిన్న కథా సంకలనాలతో నా వ్యాసంగం మొదలు పెట్టాను. అందులో ముఖ్యమైంది 'From the Cottages' (1887). పోను పోనూ నన్ను విశేషంగా ఆకర్షించిన విషయాలు వ్యక్తీకరించటానిక మరింత విశాలమైన శిల్పం, విస్తృతమైన శైలి అవసరమయినాయి. అదే సమయంలో అప్పటి వరకూ మరుగున పడి ఉండి పందొమ్మిదవ శతాబ్దంలో వికాసం చెంది, మహా కావ్యాలు, నాటకం సరసన గొప్ప స్థానం సంపాదించుకున్న నవలా ప్రక్రియపై నా దృష్టి పడింది. 1891 - 95ల మధ్య గొలుసు నవల మూడు భాగాలు 'The Promised Land', 'Lucky Peter', 'The Kingdom of the Dead వెలువడినాయి. వీటిలో మానవుల మనస్తత్వం, కష్టసుఖాల వర్ణన ద్వారా ఆనాటి సాంఘిక, మత రాజకీయ పోరాటాలు ప్రతి ఫలింప చేస్తూ కొన్ని దశాబ్దాల డెన్మార్క్ జీవితాన్ని చిత్రించాను. ఇవికాక కాలక్రమేణా మరెన్నో చిన్న పుస్తకాలు, కొంత వ్యక్తిగత విషయాలతో కూడినవి. ఊహల్లో నేను స్వేచ్ఛగా సంచరించినవీ రచించాను. వాటిలో గుర్తుంచుకో దగినవి 'Young Love', 'Memoirs', 'The Old Adam', 'Mayor Hoeck and Wife', నారచనల సంకలనాలు దాదాపు నలభై ఉంటాయి.

హెన్రిక్ పాన్టో పిడాన్ చివరి రోజులలో 'Man's Hearven' (1927) రాచారు. 1933-1943 మధ్య ఈయన ముఖ్యమైన రచనలు ఐదు సంపుటాలుగా వెలువరించారు.

# చిత్ర, శిల్ప కళల్లో సవ్యసాచి
# డా॥ వుడయార్

– కళాసాగర్

మట్టిలో భావాలు పలికించేవారు కొందరయితే, శిలలను శిల్పాలుగా మలచేవారు మరికొందరు. అయితే ఈ రెండింటిలోనే కాకుండా లోహాలలో సైతం మనోభావాల్ని పలికించి, జీవం తొణికిసలాడే బొమ్మలు రూపొందించగల మహాశిల్పి డా॥ వుడయార్‌జీ. వీరి చిత్రాన్ని గాని, శిల్పాన్నిగాని చూసిన వారెవ్వరైనా ... వాహ్వా... అనకుండా ఉండలేరు. అన్నీ ఉన్నాయ్ ... ప్రాణమొక్కటే తక్కువ అన్నంత సజీవంగా ఉంటాయా కళాఖండాలు. డా ॥ వుడయార్‌జీ శిల్పాలు విశిష్టంగా రూపొందటానికి ప్రధానకారణం - ఆయా చిత్రికాంశాలపట్ల ఆయనకున్న అవగాహన, మానవ దేహాన్ని అత్యంతాకర్షణీయంగా, వాస్తవికంగా రూపొందించటమే. శిల్పకళారాధనలో నిత్యం జీవించే కళాతపస్వి శ్రీనాధరత్నశిల్పి వుడయార్జీ ప్రధానంగా శిల్పి అయినా వీరిలో ఓ చిత్రకారుడు, జ్యోతిష పండితుడు, వాస్తు శాస్త్రవేత్త, కవి, రచయిత, గురువు, స్వాతంత్ర్య సమరయోధుడు, వైద్యుడు, ప్రజా సేవకుడు ఉన్నారు. అన్నిటికీ మించి ... మనసున్న మంచి మనిషి. అప్రతిహత ప్రతిభా నైపుణ్యాలే సోపానాలుగా అంతర్జాతీయ స్థాయికి చేరుకొన్న వుడయార్జీ ఎందరికో గురుతుల్యులు, మరెందరికో ఆదర్శప్రాయులు.

1938లో పశ్చిమ గోదావరి జిల్లా నత్తారామేశ్వరంలో కాశీపండితులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులైన దేవగుప్తపు సత్యలింగ వుడయార్, భద్రమాంబ దంపతులకు జన్మించిన వుడయార్జీ డిగ్రీ అనంతరం 1959లో విశ్వకవి రవీంద్రుడు స్థాపించిన శాంతినికేతన్‌లో చేరి ఎనిమిది సంవత్సరాలపాటు పద్మభూషణ్ నందలాల్ బోస్, రాంకింకర్‌బైజ్, పద్మశ్రీ రాధాచరణ బక్షి వంటి ఉద్దండులైన గురువుల వద్ద చిత్ర శిల్పకళలు అభ్యసించి ఫైన్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్‌లో డిప్లొమా పొందారు..

పండిట్ నెహ్రూ, డా॥ బాబూరాజేంద్రప్రసాద్, అంబేద్కర్, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, ఎలిజబెత్‌రాణి, కుముద్‌బెన్ జోషిలచే ప్రశంసలు, అవార్డులు అందుకున్న వుడయార్జీ రూపొందించిన కళా ఖండాలు కాశ్మీర్, ఇండోర్, అస్సాం, నాగాలాండ్, వారణాసి, లక్నో, కోల్‌కతా, నేపాల్, టిబెట్, మణిపూర్, తిరుపతి, ఢిల్లీ, ముంబయి, మీరట్, చెన్నై మ్యూజియంలలో శోభిల్లుతూ వీరి అంతర్జాతీయ స్థాయిని చాటుతున్నాయి.

---

ఎల్లాపు అప్పారావు, కళాసాగర్‌గా ప్రసిద్ధులు, విజయవాడ

శాంతినికేతన్‌లో రవీంద్రుడి శతజయంతి ఉత్సవాల సందర్భంగా 1964లో విశ్వకవి రవీంద్రుని బాల్యం నుండి వృద్ధాప్యం వరకు వంద శిలా ఫలకాలలో చిత్రించారు. ఆ ఫలకాలు చూసి ఆశ్చర్య పడిన పండిట్ నెహ్రూ 'ది బెస్ట్ ప్రోడక్ట్ ఆఫ్ విశ్వ భారతి' అని ప్రశంసించి, గౌరవించారు. అదే సంవత్సరం యువ శిల్పకళా పరీక్షా కాలంలో నిర్ణీత సమయం నాలుగు గంటలుకాగా అరగంట ముందుగానే అప్పటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాన్ని రూపొందించి ప్రధాని చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకున్నారు. ఒక సందర్భంలో ఎలిజబెత్ రాణి ప్రతిమను తయారు చేయగా ఆమె వుడయార్‌ను ఇంగ్లాండ్‌కు ఆహ్వానించారు. చిత్ర, శిల్పకళల రెండింటిలోనూ ప్రాక్పశ్చిమ శైలిలో సమానంగా రచన చేయగల సవ్యసాచి డా॥ వుడయార్. విదేశీ పర్యటనావకాశం లభించగా జపాన్, టిబెట్, నేపాల్, భూటాన్, చైనా, శ్రీలంక, ఇండోనేషియా, మంగోలియా, అమెరికా దేశాలు పర్యటించి అక్కడి శిల్ప కళా నైపుణ్యతను పరిశీలించి శాంతినికేతన్ ప్రతిష్ఠను మరింత ఇనుమడింప జేసారు.

1986లో హైదరాబాద్‌లోని టాంక్‌బండ్‌పై అన్నమాచార్యుని కాంస్య విగ్రహాన్ని రూపొందించి అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు గారిని ముగ్ధుల్ని చేసారు. నాలుగు దశాబ్దాలుగా శిల్పరచన చేస్తూ ఇప్పటికి సుమారు లక్ష శిల్పాలను రూపొందించిన వీరికి ఇటీవలే అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్శిటీ వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసారు. డా॥ వుడయార్జీ అద్భుత కళానైపుణ్యానికి తార్కాణంగా ఇండియన్ మైఖేలేంజిలో, శిల్పకళా సార్వభౌమ, ఆచార్య శిల్పశ్రీ, శిల్ప సరస్వతి, అభినవ మయబ్రహ్మ, ఆదర్శశిల్పి, సమతాశిల్పి, వాస్తువిశారద వంటి అనేక బిరుదులు వరించాయి.

ఆంధ్రా ఆర్టిస్టు, స్కల్ప్టర్స్ అండ్ కార్టూనిస్టు అసోసియేషన్ (ఆస్కా) గౌరవ అధ్యక్షులుగా ఉంటూ, 2001 సంవత్సరములో ఆంధ్రప్రదేశ్‌లో నున్న సుమారు 270 మంది చిత్ర శిల్పుల మరియు కార్టూనిస్టుల పరిచయ గ్రంథాన్ని 'ఆంధ్రకళాదర్శిని' [illegible]స్కా' ద్వారా ప్రచురించేందుకు సహకరించి, ఎందరో కళాకారులు వెలుగులోకి వచ్చేందుకు కృషి చేసారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో 'వుడయార్ అకాడెమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' పేరుతో శిల్ప కళాశాలను స్థాపించి, ఈ ఆధునిక యుగంలో అతి ప్రాచీనమైన శిల్పకళ అంతరించి పోకుండా అనేక మంది యువకులను శిల్పులుగా రూపు దిద్దుతున్నారు. ఎన్నో కోవెలలు, కట్టడాలు, జాతీయనాయకుల విగ్రహాలు చెక్కి మన సాంస్కృతిక వారసత్వాన్ని ముందుకు నడిపిస్తున్న డా॥ వుడయార్జీ మహా శిల్పే కాదు, మహోద్యమ స్ఫూర్తి.

# కుల నిర్మూలనను మిథ్యగా భావించిన ఒక బ్రాహ్మణుడి ఆత్మకథ

## (ఏప్రిల్ 14, అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ వ్యాసం)

– టి. రవిచంద్

తెలుగులో స్వీయ చరిత్రలు అనేకం వచ్చాయి. స్వీయ జీవిత చరిత్రలు రాసిన వారిలో ఎక్కువ మంది వివిధ రంగాలలో, వివిధ ఉద్యమాలలో ప్రముఖ పాత్ర నిర్వహించి, తెలుగు ప్రజల్ని ఏదో ఒక విధంగా ప్రభావితం చేసినవారు. వీరిలో సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు నుండి విప్లవ కవి శ్రీశ్రీ; వర్ణ, కుల వ్యవస్థల్ని ప్రశ్నించిన మహాకవి జాషువ వరకు అనేకమంది తెలుగు ప్రముఖులు స్వీయ జీవిత చరిత్రలు రాసిన వారే. ఈ స్వీయ జీవిత చరిత్రల్లో వీరేశలింగం, శ్రీశ్రీల స్వీయ జీవిత చరిత్రలు అనేక వివాదాలకు, చర్చలకు దారితీశాయి. ఏ వివాదాలకు తావివ్వకుండా జరిగిన సంఘటనల్ని జరిగినట్టుగా గ్రంథస్థం చేసిన సహృదయ సాహితీ మూర్తులు దర్శి చెంచయ్య, జాషువలు ఉన్నారు. వీరంతా ఆధునిక తెలుగు ప్రజల సామాజిక జీవితాన్ని ప్రభావితం చేసిన మహనీయులే.

తెలుగు స్వీయ జీవిత చరిత్రలలో వీరేశలింగం ''స్వీయ జీవిత చరిత్రము'' (ప్రథమ భాగం 1911, ద్వితీయ భాగం 1915) ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో వివాదాస్పద రచనగా మిగిలింది. ఈ వ్యాసం రాస్తున్న సమయంలోనే జయధీర్ తిరుమలరావు ''వార్త''[1] దినపత్రికలో వీరేశలింగం స్వీయ జీవిత చరిత్రను ఆధారం చేసుకొని తొలి తెలుగు నవల ఏది? అని చర్చించారు. ఈ చర్చ కొత్తది కాదు. పాతదే. దాదాపు ఈ చర్చ ముగిసినట్లే. ప్రొ॥ జి.ఎన్. రెడ్డి 1955 సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయానికి సమర్పించిన తమ పరిశోధనా పత్రంలో తొలి తెలుగు నవల గురించి, నవలా రచయిత గురించి ఎటువంటి వివాదానికి తావివ్వకుండా స్పష్టంగా చెప్పారు. 1878లో ప్రచురించబడిన రాజశేఖర చరిత్ర నవల వలన కందుకూరి వీరేశలింగం తొలి నవలా రచయితగా గుర్తించబడ్డాడు. ఐనను మనకు నరహరి గోపాలకృష్ణమశెట్టి రచించిన మౌలిక నవల (Original Novel) శ్రీ రంగరాజు చరిత్ర ఉంది. ఇది 1872లో ముద్రించబడింది. దీనిలో ఐదు ఉల్లాసములు (అధ్యాయాలు) ఉన్నాయి. ఇది మన తొలి తెలుగు నవల. కాని ఇది ఇంగ్లీషు మూలానికి అనువాదమో, అనుసరణో కాదు. స్వతంత్ర నవల. ఈ అభిప్రాయం జి.ఎన్. రెడ్డి దాదాపు ఐదు దశాబ్దాల క్రితమే ప్రకటించారు.[2] ఇదేవిధంగా 1960లో తొలి ముద్రణ పొందిన కొత్తపల్లి వీరభద్రరావు పరిశోధనా గ్రంథం ''తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము''[3]లో తొలి తెలుగు నవలా రచయిత నరహరి గోపాలకృష్ణమశెట్టి జీవిత, సాహిత్యాల్ని విపులంగా చర్చించారు. ఆయన జీవితం, సాహిత్యాల గురించి అనేక కొత్త విషయాలు వెలుగులోకి తెచ్చారు. కొత్తపల్లి వీరభద్రరావు తొలి తెలుగు నవలా రచయితగా నరహరి గోపాల కృష్ణమశెట్టిని పేర్కొంటూనే, ఆయన కంటే ముందు కొక్కొండ వెంకటరత్నం పంతులు ''మహాశ్వేత''[4] (1867) అనే నవల రాసినట్టు మరో కొత్త విషయం కూడా బయటపెట్టారు. ఈ విషయాలేవీ జయధీర్ తిరుమలరావు ''వార్త''లో రాసిన వ్యాసంలో పేర్కొనలేదు. అంతేకాదు. తెలుగు

---

టి. రవిచంద్, గుంటూరు.

విశ్వవిద్యాలయం ప్రచురించిన జాన్ గ్రీన్ఫీల్డ్ లియోనార్డ్ పరిశోధనా గ్రంథం ''కందుకూరి వీరేశలింగం (1848-1919)''[5] లో కూడా వీరేశలింగం నవల ''రాజశేఖర చరిత్ర'' తొలి తెలుగు నవలకాదని, సాహితీ చరిత్రకారుడు రమాపతిరావు నరహరి గోపాల కృష్ణమశెట్టి రచించిన ''శ్రీరంగ రాజు చరిత్రము'' (1872)ను తొలి తెలుగు నవలగా కనుగొన్నారని, కాని వీరేశలింగం నవలకే ఎక్కువ ప్రచారం వచ్చిందని తెలిపారు. అందువల్ల తెలుగు సాహిత్యంలోని సీరియస్ పరిశోధకులెవరూ నరహరి గోపాలకృష్ణమ శెట్టి 1872లో రచించిన ''శ్రీరంగరాజు చరిత్ర''ను తొలి తెలుగు నవలగా గుర్తించకపోవడమనే సమస్యే తలెత్తలేదు. కాని జయధీర్ తిరుమలరావు తమ వ్యాసంలో పేర్కొన్నట్టు నరహరి గోపాల కృష్ణమశెట్టి తన తొలి నవలలో ప్రదర్శించిన సామాజిక దృష్టి కోణం (Social Perspective) ఎంతో ఆధునికమైనది, మానవతా పూరితమైనది. కాబట్టి జయధీర్ తిరుమలరావు లాంటివారెవరయినా నరహరి గోపాల కృష్ణమశెట్టి జీవిత, సాహిత్యాలపై ఒక సమగ్ర రచనకు పూనుకొని, నూట ముప్పయి సంవత్సరాల క్రితమే హిందూ పురాణాలపై, వర్ణాశ్రమ వ్యవస్థపై లోతైన విమర్శ చేసిన ఆయన జీవితాన్ని ప్రజలకందించాలి. తెలుగు సాహిత్య చరిత్రలో నరహరి గోపాల కృష్ణమశెట్టికి దక్కాల్సిన సముచిత స్థానం లభించేట్టు చేయడమే సామాజిక పరిశోధకుల ప్రథమ కర్తవ్యం.

ఈ మధ్య కాలంలో తెలుగులో మరో రెండు స్వీయ జీవిత చరిత్రలు వెలువడ్డాయి. ఒకటి అభ్యుదయ కవి రాంభట్ల కృష్ణమూర్తి ''సొంతకథ'' (2001), రెండవది విప్లవ రచయితల సంఘం సభ్యుడు రాణి శివశంకరశర్మ ఆత్మ (తన) కథ ''దిలాస్ట్ బ్రాహ్మిన్'' (2002). ఇద్దరూ సనాతన బ్రాహ్మణకుటుంబాలలో పుట్టి, ఆధునిక భావాల వైపు ఆకర్షితులయి అభ్యుదయ, విప్లవ రచయితలుగా పరివర్తన చెందినవారు. రాంభట్ల కృష్ణమూర్తి కేవలం అభ్యుదయ కవి, రచయిత మాత్రమేకాదు. ఆయన పండితుడు, పరిశోధకుడు కూడా. కౌటిల్యం తెలియని కమ్యూనిస్టు. నిర్భయంగా, నిజాయితీగా తన భావజాల మిత్రుల, నాయకుల ఫ్యూడల్ మనస్తత్వాన్ని బయట పెట్టి, వీరికంటే పెట్టుబడి దారుడైన రామోజీరావే నయం అని ప్రకటించిన వాడు రాంభట్ల కృష్ణమూర్తి. కమ్యూనిస్టుల పరిభాషలో, వారిదృష్టిలో ఫ్యూడలిజం కన్న పెట్టు బడిదారీ విధానం అభ్యుదయ కరమైందని చెప్పి, పెట్టుబడిదారుడైన తన మిత్రుడు రామోజీరావు ''వేయిరెట్లు ఎక్కువ'' అని అనగలిగిన ధీశాలి. దిలాస్ట్ బ్రాహ్మిన్ పేరుతో ఆత్మ (తన) కథరాసిన రాణి శివశంకర్ శర్మ ఆయనలా సుప్రసిద్ధ రచయితకాదు. కాని జన్మతః సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన తాను విప్లవ రచయితనని, కులనిర్మూలన వాదినని, నాస్తికుడ్నని ఆయన చెప్పుకున్నారు. వయసులో కూడా ఈయన రాంభట్ల కృష్ణమూర్తి కంటే చాలా చిన్నవాడు. ఆత్మ కథలో ఈ వివరాలు లేవు. కాల క్రమణిక ననుసరించి ఆయన తన జీవిత చరిత్ర రాయలేదు. రాణి శివశంకర శర్మ ఆత్మకథ సనాతన ధార్మిక బ్రాహ్మణుడైన తన తండ్రి జీవిత కథతో మొదలవుతుంది. రాంభట్ల కృష్ణమూర్తి సొంత కథ బ్రాహ్మణ్యంతో ప్రారంభమవుతుంది. ఛాందస ఆచారాల నుండి బయటపడి, వామ పక్ష భావాలతో తమ వ్యక్తిత్వాలను మలుచుకున్నారు వీరు. ఇద్దరూ కమ్యూనిస్టులే! కాని ఇద్దరికి తమ ఉద్యమ మిత్రులలో తీవ్రవైరుధ్యాలు, లోపాలు కనిపించాయి. రాంభట్ల కృష్ణమూర్తి తన పార్టీలో, మిత్రులలో కనిపించిన లోపాల్ని ప్రశ్నిస్తూ, చివరివరకు అభ్యుదయ రచయితల సంఘంలోనే కొనసాగారు. ఆయనకు తాను విశ్వసిస్తూ వచ్చిన ఆదర్శాలపై అపనమ్మకం ఏర్పడలేదు. కాని రాణి శివశంకర శర్మ తాను ఇప్పటివరకు నమ్ముతూ వచ్చిన సంస్థల్ని, వాటి ఆదర్శాల్నే శంకించటం ప్రారంభించారు. ఆయన పోస్టు మోడర్నిస్టు

(ఆధునికాంతరవాది) అయ్యారు. అయితే ఈ ఇద్దరికి ఒక విషయంలో పూర్తి ఏకీభావం ఉంది. అది కులనిర్మూలన సిద్ధాంతం. వీరు దీన్ని కుల నిర్మూలన సిద్ధాంతం అని కూడా అనరు. వీరి దృష్టిలో అది కేవలం నినాదమే! వీరిద్దరు ఏమంటున్నారో చూడండి - ''ఈ దేశాన కులం మొక్క ఎప్పుడు వేళ్ళూనిందో తెలియదు. కాని అందరూ కుల నిర్మూలన కావాలని నినాదాలు చేస్తుంటారు. మంత్రాలకు చింతకాయలు రాలవు. నినాదాలకు కులాలు తూలవు ''(రాంభట్ల కృష్ణమూర్తి)[6]. ''అన్ని కులాల నిర్మూలన జరగాలని కుల నిర్మూలన వాదులంటారు. కుల నిర్మూలన ఏకులంవారు చేస్తారు అని అడిగితే సమాధానం ఉండదు. కుల నిర్మూలన అనేదే మిథ్యా నినాదం. అది ఒక మిథ్యా ఉద్యమం. దాని మార్గము మిథ్యే. గమ్యమూ మిథ్యే'' (రాణీ శివశంకరశర్మ)[7]. వీరిద్దరు ఈ మాటల్ని ఎవర్ని ఉద్దేశించి అన్నారో సమకాలిక భారతదేశ చరిత్రతో ఏమాత్రం పరిచయం ఉన్నవారయినా అర్థం చేసుకోగలరు. ఉద్యమాల వైఫల్యాలను ఆదర్శాలకు అంటగట్టి, ఆ ఆదర్శాల్నే శంకించడం, అవి మిథ్యా భావాలనడం గత చరిత్రలో గాఢమైన అవగాహన, లోతైన అధ్యయనం ఉన్నవారు అనే మాటలు కావు. ఎంతటి ఉన్నతాశయాలయినా, భావాలయినా మరుగుజ్జులలాంటి అనుచరుల అవగాహనా రాహిత్యం వల్ల భ్రష్టు పడతాయి. అనుచరుల భ్రష్టత్వాన్ని ఆదర్శాల రూపశిల్పికి అన్వయించి కుల నిర్మూలన సిద్ధాంతాన్ని కేవలం ఒక నినాదంగా చిత్రించడం తమ అహేతుకతను ప్రదర్శించుకోవడమే! ప్రస్తుతం మనం ఎటువంటి ఉన్నతాదర్శాలు, లక్ష్యాలు లేని సమాజంలో జీవిస్తున్నాం. ఆశయాలు అంతరించి, ఆర్థిక ప్రయోజనాలు అంతిమ లక్ష్యంగా మారి, కులతత్వం బలపడుతున్న పరిస్థితులలో ఉన్నతాదర్శాలు అవహేళనకు గురవుతున్నాయి. ఇటువంటి పరిస్థితులలో సామాజిక పరిణామాల పట్ల స్వీయ మానసిక ధోరణితో ప్రతిస్పందించేవారు, వారెంత గొప్ప వారయినా, ఇంత కాలం తాము విశ్వసిస్తున్న సకల ఆదర్శాల్ని ప్రశ్నించే దశకు చేరుకుంటారు. ప్రశ్నించటం తప్పుకాదు. ప్రశ్నించటం ద్వారా మానసిక పరిణతిని పొందగలగాలి. మన ప్రశ్నకు ఎదుటి వాళ్ళు సమాధానం చెప్ప లేకపోయారు కాబట్టి మన ప్రశ్నే సరియైందనుకొంటే అంతకంటే చారిత్రక అజ్ఞానం, అమాయకత్వం ఉండవు. పైన పేర్కొన్న రెండు ఉల్లేఖనల్లో రాంభట్ల కృష్ణమూర్తి కులనిర్మూలన కావాలని నినాదాలు చేసే వారిని కేవలం విమర్శించి ఊరుకున్నారు. కాని దిలాస్ట్ బ్రాహ్మిన్ గ్రంథ రచయిత రాణీ శివశంకర శర్మ అసలు కుల నిర్మూలన ఆదర్శమే మిథ్యా నినాదమని శంకరాద్వైత పరిభాషలో ఖండించారు!

రాణీ శివశంకరశర్మ ఆత్మకథ పేరుతో కమ్యూనిస్టు, కుల నిర్మూలన సిద్ధాంతాలపై చాలా తెలివైన **(Clever)** దాడి చేశారు. సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి వామపక్ష భావాలు, కుల నిర్మూలన సిద్ధాంతాలపట్ల ఆకర్షితుడయిన ఆయన ఈ ఉద్యమాలు ఎదుర్కొంటున్న సైద్ధాంతిక సంక్షోభాన్ని చూసి మరల సనాతన బ్రాహ్మణ ధర్మంవైపు ప్రయాణించడం ఒక విధంగా బాధాకరమే. ఆ తిరోగమనం ఆయన వరకే పరిమితమయితే మనం పట్టించుకోవాల్సిన పని లేదు. ఆయనతో పాటు ఈ ఉద్యమాలలోని వారిని కూడా తన తిరోగమన మార్గంలోకి మళ్ళించడానికి ఆయన వేసిన వల దిలాస్ట్ బ్రాహ్మిన్ గ్రంథం. ఆయన తెలివైన తర్కానికి తార్కాణం కుల నిర్మూలన పదబంధంపై చేసిన విమర్శ. కుల నిర్మూలన, కుల నిర్మూలన అంటుంటారు. ఎవరు ఎవర్ని నిర్మూలిస్తారని కుల నిర్మూలన వాదులను ప్రశ్నించారు. డా॥ అంబేద్కర్ కుల నిర్మూలన పుస్తకాన్ని (ప్రసంగపాఠం) చదవని కుల నిర్మూలన వాదులను ప్రశ్నిస్తే వాళ్ళేమి సమాధానం చెబుతారు. వాళ్ళు సమాధానం చెప్పలేకపోయారు. కాబట్టి గెలుపు నాదేనను కొంటున్నారు రాణీ శివశంకర శర్మ. డా॥ అంబేద్కర్ తన పుస్తకానికి కుల

నిర్మూలన అని పేరు పెట్టారు కాబట్టి ఆయన భౌతికంగా అన్ని కులాల్ని నిర్మూలించాలన్నారని భ్రమ పడ్డారు. ఆయన ప్రసంగ పాఠమైన కుల నిర్మూలన పుస్తకాన్ని పూర్తిగా చదివితే రాణి శివశంకర శర్మ లేవనెత్తిన అనేక ప్రశ్నలకు చక్కని సమాధానం లభిస్తుంది. ప్రతి పదాన్ని కేవలం శాబ్దికార్థంతో చూస్తే కొన్ని సమయాల్లో ఇటువంటి విపరీతార్థాలకు, తప్పుడు వ్యాఖ్యానాలకు దారి తీస్తాయి. కుల నిర్మూలనను లాక్షణికార్థంతో చూస్తే దాని సాంకేతికార్థం, ఆ పదబంధం స్ఫూర్తి అర్థమవుతాయి. కుల వ్యవస్థను, కుల దృష్టిని అధిగమించడం అనే డా॥ అంబేద్కర్ కుల నిర్మూలనకు ఉద్దేశించిన అర్థం. ఈ విషయం కుల నిర్మూలన పుస్తకాన్ని ఎటువంటి పూర్వ నిర్ధారిత అభిప్రయాలు లేకుండా చదివితే బాగా బోధపడుతుంది. డా॥ అంబేద్కర్ దృష్టిలో కుల నిర్మూలన అంటే ఏమిటో తెలుసుకోవడం కోసం కుల నిర్మూలన గ్రంథంలో ఆయన దీనిపై ప్రకటించిన అభిప్రాయాన్ని ఒకసారి చూద్దాం : ''కులం అనేది హిందువులను కలవకుండా చేసే ఒక ఇటుక గోడో, ముళ్ళ తీగో కాదు - సులభంగా తొలగించి పారవేయడానికి. హిందువులలో కులం అనేది ఒక భావన. ఒక విశ్వాసం. ఒక మనః స్థితి. కులాన్ని తొలగించడం అంటే భౌతికమైన ఒక అడ్డంకిని తొలగించడం కాదు. మనో భావనలోనే ఒక మార్పును సాధించడం. హిందూ ప్రజలకు కులమంటే పట్టింపు కలిగి ఉండటం తప్పేమీ కాదు. నిజానికి, నా ఉద్దేశంలో అసలు తప్పేదంటో, అది వాళ్ళ మతం. కులం అనే పిచ్చి నమ్మకాన్ని వాళ్ళ మనస్సులో నాటిన వాళ్ళ మతం. అటువంటప్పుడు మనం ఎదుర్కోవలసిన శత్రువు కుల వ్యవస్థను అనుసరిస్తున్న ప్రజను కాదు. అట్టి కుల వ్యవస్థతో కూడిన మతాన్ని, వాళ్ళకు ప్రబోధిస్తూ శాస్త్రాల్ని.''[8] రాణి శివశంకర శర్మ ఎటువంటి ప్రమాదకరమైన వక్రీకరణకు పాల్పడ్డారో ఆయన కుల నిర్మూలన పదబంధానికి చేసిన వ్యాఖ్యే చెబుతుంది. అంతేకాదు. కుల నిర్మూలన హిందువుల నినాదమంటారు అయన. ఏ హిందూ మత సంస్కర్త (వివేకానందుడి నుంచి గాంధీజి వరకు) కుల (వర్ణ) నిర్మూలన గురించి మాట్లాడారు? కులం పునాదులపైన ఏజాతినీ, నీతినీ నిర్మించలేరని డా॥ అంబేద్కరంటే దీన్ని విరూపం చేసి వ్యాఖ్యానించారు రాణి శివశంకర శర్మ. ఇక్కడ జాతి అంటే భారత జాతి అని డా॥ అంబేద్కర్ అభిప్రయం. హిందూ జాతి అని కాదు. ఆయన భౌగోళికార్థంలోనే జాతి పద ప్రయోగం చేశారు.[9] ''హిందూ సమాజమే పుక్కిటి పురాణమని, హిందూ అనే పదమే ఒక విదేశీ పద'' మని ఆయన స్పష్టంగా చెప్పారు. అసలు డా॥ అంబేద్కర్ కుల నిర్మూలన పుస్తకాన్ని ఏ సందర్భంలో, ఎవర్ని ఉద్దేశించి రాశారో రాణి శివశంకరశర్మ గుర్తించినట్లయితే ఇటువంటి పసలేని పేలవమైన విమర్శ చేసి ఉండేవారు కాదు. పాఠం (text), సందర్భం (context) దృష్టిలో పెట్టుకొని కుల నిర్మూలన గ్రంథం చదివితే కాని రాణి శివశంకర శర్మ విమర్శలోని అంతరార్థం అర్థంకాదు. ఆయనకు కుల నిర్మూలన అంటే ఏమిటో తెలుసా అనే సందేహం దిలాస్ట్ బ్రాహ్మిన్‌ను విమర్శనాత్మకంగా చదివిన వారికి కలుగుతుంది. ''కుల నిర్మూలన అనగా సర్వశ్రేష్ఠమైన హిందూ బ్రాహ్మణ స్థితికి చేయు ప్రయాణమే. వ్యక్తులుగా శిష్టాచారాల బ్రాహ్మణాచారాల పాటింపు కలదు. శాకాహారి కావడం మాత్రం చేత విశిష్టత చేకూరును. తమ పరాజిత కులాలను హిందూ అనే సర్వనామం కింద దాచుకొనవచ్చును. అపరాజితకులాల పేర్లతో వారు జీవించి ఉండటం పాపం అనే భావన పెంచుకొనవచ్చును. వేదాధికారము లభించును. దీనినే కుల నిర్మూలన అంటారు.''[10] ఇది కుల నిర్మూలనమా? లేక సంస్కృతీకరణమా? కుల నిర్మూలనకు, సంస్కృతీకరణానికి గల తేడా కూడా తెలియని రాణి శివశంకరశర్మ డా॥ అంబేద్కర్ కుల నిర్మూలన సిద్ధాంతంపై దాడి చేయాలని ప్రయత్నించడం గొప్ప సైద్ధాంతిక సాహసమే!

ఎం.ఎన్.శ్రీనివాస్ అనే సామాజిక శాస్త్రజ్ఞుడు ''భారతదేశంలో సామాజిక పరివర్తన'' (Social Change in India) అనే గ్రంథంలో సంస్కృతీకరణం (Sanskritisation) అనే భావనను వివరిస్తూ ఇలా పేర్కొంటారు. ''ఒక నిమ్న జాతికాని, కులం కాని, తెగకాని, ఇతర సమూహంకాని ఆచారాలలోను, సంస్కారాలలోను, తాత్త్విక సిద్ధాంతాలలోను, జీవన విధానాలలోను ఉన్నతమైన అంటే ముఖ్యంగా బ్రహ్మణ వర్ణం మోస్తరుగా పరివర్తన చెందే ప్రక్రియను సంస్కృతీకరణమని చెప్పవచ్చు.''[11] రాణి శివశంకర శర్మ ''కుల నిర్మూలన అనగా ....'' అంటూ పేర్కొన్న లక్షణాలన్నీ సంస్కృతీకరణ కిందకి వస్తాయి. కుల నిర్మూలన భావనలో ఏ అగ్రవర్ణాన్ని అనుకరించి పరివర్తన చెందడం కాని, ఏ అగ్రవర్ణం సామాజికంగా పొందిన ఉన్నత స్థితిని చేరుకోవాలని ఆకాంక్షకాని ఉండదు. కుల రహిత సమాజ నిర్మాణమే కుల నిర్మూలన సిద్ధాంతం అంతిమ లక్ష్యం. అటువంటి ఉన్నతమైన మానవ వాద సిద్ధాంతాన్ని అగ్రవర్ణీకరణం చెందడానికి ఉపయోగ పడే సామాజిక ప్రక్రియ సంస్కృతీకరణగా భావించడం రాణి శివశంకర శర్మకు సామాజికి శాస్త్రానికి సంబంధించిన ప్రాథమిక భావనలతో కూడా పరిచయం లేదని స్పష్టం చేస్తుంది. తనకే స్పష్టంగా అర్థంకాని సామాజిక సిద్ధాంతాల్ని పాఠకులకు చెప్పాలని ఆయన చేసిన ప్రయత్నం వృథా ప్రయాసగా మిగిలిపోయింది.

కులనిర్మూలన సిద్ధాంతం పట్ల ఎంతో అస్పష్టమైన అవగాహన కలిగిన రాణి శివ శంకర శర్మ కుల నిర్మూలనను అగ్రవర్ణ హిందూ సిద్ధాంతంగా చిత్రిస్తాడు! ఇది అగ్రవర్ణ హిందూ వాదమని ఆయనకు జ్ఞానోదయం కాంగల్నే కమ్యూనిజం, కుల నిర్మూలన సిద్ధాంతాల ప్రభావం వల్ల గతంలో రాణి శివశంకర్‌గా మారిన ఆయన మరల రాణి శివశంకర శర్మగా రూపాంతరం చెందారు. అంతేకాదు. సనాతన ధార్మిక బ్రాహ్మణుడైన తన తండ్రిలో కుల వివక్ష నిర్మూలించగల విప్లవ కారుడు దాగి ఉన్నాడని ఆయన గుర్తించ గలిగాడు. కుల నిర్మూలన సిద్ధాంతం కంటే ఏమత వాసనాలేని సనాతన బ్రాహ్మణ ధర్మాన్ని అనుసరించడమే పోస్ట్‌మోడర్నిజం (ఆధునికానంతర వాదం)గా ఆయన భావిస్తున్నారు. పీడిత కులాల విముక్తికి కుల నిర్మూలన సిద్ధాంతం ఎంత భయంకరమైన అడ్డంకిగా మారిందో గుర్తించిన రాణి శివశంకరశర్మ పోస్ట్ మోడర్నిజం పట్ల ఆకర్షితులయ్యారు. ఈ పోస్టు మోడర్నిజం కూడా ఆయనకు ఏ విదేశీ ఆంగ్ల గ్రంథం చదివితేనో మొదట పరిచయం కాలేదు. ఒక సందర్భంలో ఒక స్వదేశీ భూత వైద్యుడు దెయ్యాలకూ కులాలుంటాయని చెప్పంగల్నే ఆయనలో ''పోస్ట్‌మోడర్న్ బీజాలు'' నాటుకున్నాయి. ఇలా నాటుకోవడంలో నాకు తెలిసినంతవరకు ఏ సామ్రాజ్యవాదుల కుట్రకాని వారి ఏజంట్లయిన క్రైస్తవుల ఎత్తుగడ కాని లేదు. ఎవరి కుట్రలు, ఎత్తుగడలు లేకుండానే రాణి శివశంకర్ కాదు, కాదు రాణి శివశంకర శర్మ పోస్ట్ మోడర్నిస్టు అయ్యారు. ఇక ఈ అత్యాధునిక దృష్టికోణంతో సకల ప్రగతి శీల ఉద్యమాల్ని, ఉన్నతాదర్శాల్ని తునాతునకలు చేసి, మంద కృష్ణ మాదిగ నడుస్తున్న ఉన్నత పథంలో ప్రయాణిస్తూ, మాదిగ దండోరా ద్వారా సనాతన ధర్మ పునరుద్ధరణకు, పోస్టు మోడర్నిస్టులతో కలిసి సమైక్యంగా పోరాడి దిలాస్ట్‌బ్రాహ్మిన్ అయిన తమ తండ్రిగారి ఆదర్శాల్ని ముందుకు తీసుకెళ్ళారు రాణి శివశంకర శర్మ. ఇదీ ఆయన ఆత్మకథ, తన నాన్నగారి జీవిత కథ అయిన దిలాస్ట్ బ్రాహ్మిన్ (ఆఖరి బ్రాహ్మణుడు) అందించే అంతిమ సందేశం. అయితే ఈ విషయాన్ని అంత సూటిగా, స్పష్టంగా చెబితే అది పోస్ట్‌మోడర్నిజం ఎలా అవుతుంది? అనేక విషయాల కలగూర గంపగా తన ఆత్మకథను తీర్చి దిద్ది సామాన్య పాఠకుల్ని సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు.

(సశేషం)

# అత్యధిక ఉష్ణోగ్రతలు - వినియోగ విధానాలు

- సి.వి. సర్వేశ్వర శర్మ

ప్రకృతిలో మనకు అతి తక్కువ ఉష్ణోగ్రతకు హద్దు ఉంది. అదే పరమశూన్య ఉష్ణోగ్రత. కాని అతి ఎక్కువ ఉష్ణోగ్రతకు హద్దు నిర్ణయింపబడలేదు.

సైన్సులో ఈ రోజున వందల, వేల డిగ్రీల సెలిసియస్ ఉష్ణోగ్రతలను సాధించగల్గుతున్నాము. అటువంటి ఉష్ణోగ్రతలను పసిగట్టడమే కాదు వాటిని కొలవగల్గుతున్నాము.

సామాన్యునికి చాలా తక్కువ పరిధిలో ఉన్న ఉష్ణోగ్రతలతో మాత్రమే పరిచయం ఉంటుంది. సామాన్యుని శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెలిసియస్ ఉంటే చాలా హెచ్చు ఉష్ణోగ్రతగా పరిగణిస్తాడు. ఎందుకంటే సామాన్యంగా ఉండాల్సిన ఉష్ణోగ్రతకు ఇది మూడు డిగ్రీలు సెలిసియస్ మాత్రమే ఎక్కువ.

వాతావరణం ఉష్ణోగ్రత 45 డిగ్రీల సెలిసియస్ ఉందంటే దానిని ఒక రికార్డుగా చెప్పేసుకుంటారు. ఇచట 'హెచ్చు' అనే మాట క్షేమదాయకమైన ఉష్ణోగ్రత కన్నా సాపేక్షంగా ఎక్కువ అనే భావం ప్రధానమైనది.

సామాన్యుడికి అనుదినం ఎదురయ్యే మరొక అధిక ఉష్ణోగ్రత గలది మంట. సాధారణంగా ఉండే మంట ఉష్ణోగ్రత వెయ్యి డిగ్రీల సెలిసియస్ లోపు ఉంటుంది. మరి ప్రయోగశాలల్లో వెయ్యి డిగ్రీల సెలిసియస్ ఒక మోస్తరు ఉష్ణోగ్రతగా పరిగణిస్తారు. వెయ్యి డిగ్రీల సెలిసియస్ మించిన ఉష్ణోగ్రతను ప్రయోగశాలలో హెచ్చు ఉష్ణోగ్రతగా భావిస్తారు.

**హెచ్చు-తగ్గులు:**

ఇక్కడ హెచ్చు, తక్కువ అనే పదాలు సాంకేతిక దృష్ట్యా చెబుతారు. అంటే అంతటి ఉష్ణోగ్రతను సాధించడంలోగల ఇబ్బందులు, ఆ ఉష్ణోగ్రతను తట్టుకోగల పదార్థాల ఎంపిక ఆధారంగా ఉష్ణోగ్రత ఎక్కువ, తక్కువ పదాలు వాడుతారు.

ఉష్ణోగ్రత పెరిగే కొలది పదార్థాల చర్యా శీలత పెరిగిపోతుంది. అందుకే బాగా హెచ్చు ఉష్ణోగ్రత వద్దకు వెళ్లేసరికి రసాయనికంగా పదార్థం అవ్యక్తస్థితికి వస్తుంది అని భయపడుతూ ఉంటారు. నిజానికి ఈ హెచ్చు ఉష్ణోగ్రతల వద్ద రసాయనిక మార్పిడి చర్యలు, రసాయనిక సంశ్లేషణము గొప్ప నాణ్యతతో జరిగి రసాయన శాస్త్రంలో కొత్త మార్గాలకు అవకాశం దొరుకుతుంది.

హెచ్చు ఉష్ణోగ్రతల వద్ద ఎన్నో కొత్త కార్బనేతర రసాయన పదార్థాలు ఉత్పత్తి చేయడం సులువు అవుతుంది. అసలు చాలా ఎక్కువ ఉష్ణోగ్రతల వద్ద రూపం పోసుకున్నవాటిలో మొట్టమొదటిది మనం నివసిస్తున్న భూమి.

---

సైన్సు చక్రవర్తి సి.వి. సర్వేశ్వర శర్మ, ప్రెసిడెంట్, కోనసీమ సైన్సు పరిషత్, అమలాపురం.

ఈనాడు జరుగుతున్న రసాయన, లోహ సంగ్రహణ చర్యలకు హెచ్చు ఉష్ణోగ్రతలను సృష్టించడం జరుగుతోంది. ఇనుప లోహాన్ని దాని ఆక్సైడు ఖనిజాన్ని ఉపయోగించి ఈ హెచ్చు ఉష్ణోగ్రత వద్ద రాబట్టగల్గుతున్నారు. అదేవిధంగా హెచ్చు ఉష్ణోగ్రతా పీడనాల వద్ద నైట్రోజన్, హైడ్రోజన్‌లను సంయోగ పరచి అమోనియాను తయారు చేస్తున్నారు.

అదేవిధంగా కార్బన్‌ను ఈ హెచ్చు ఉష్ణోగ్రతా, పీడనాల ఆధారంగా వజ్రంగా రూపాంతరం చెందించగల్గుతున్నారు.

**హెచ్చు ఉష్ణోగ్రతలు - మానవుని అభివృద్ధి:**

చారిత్రాత్మకంగా చూస్తే మొదట్లో మానవుడికి 'అగ్ని' అంటే దైవత్వం, మహత్యం ఉన్న దానివలె భావించి ఆరాధించేవాడు. అగ్నిని అగ్నిదేముడని కొలచేవారు. ఎందుకంటే అగ్ని చాలా హెచ్చు ఉష్ణోగ్రతలను ఏర్పరచగలదు. అచట అసాధారణ విషయాలు జరుగుతాయి.

అధిక ఉష్ణోగ్రతలు సృష్టించడం నేర్చుకోవడం మానవుని అభివృద్ధి అధికమవడం ఒకదానితో మరొకటి ముడిపడి ఉండడం మనం గమనిస్తాం.

రాతియుగంలో మనిషి గోతులు తవ్వి అందులో మంటలు ఏర్పరచి సుమారు ఆరువందల డిగ్రీల సెలిసియస్ ఉష్ణోగ్రతలను సృష్టించుకునేవాడు. ఈ ఉష్ణోగ్రతల వద్ద లోహాలను కరుగబెట్టి కంచువంటి మిశ్రలోహాలు తయారు చేసేవాడు.

ఆ తరువాత ఈ కొలిమిల రూపు రేఖలు అభివృద్ధి చెందాయి. 1350 డిగ్రీల సెలిసియస్ ఉష్ణోగ్రతలు సృష్టించడం ఆ ఉష్ణోగ్రత వద్ద రాగిని కరిగించడం, మలిన పూరితమైన ఇనుమును కరిగించడం నేర్చుకున్నాడు. అయితే గత శతాబ్ద మధ్యస్థం వరకు ఇదే మానవుడు సృష్టించగల్గిన గరిష్ట ఉష్ణోగ్రతగా మిగిలిపోయింది.

19వ శతాబ్దంతో కొత్త విషయం తెలుసుకున్నారు. గాలిని ముందుగా వేడి చేస్తే హెచ్చు ఉష్ణోగ్రతలు పొందడం సులభం అని గుర్తించారు. పైగా ఈ గాలిలో ఆక్సిజన్ సమృద్ధిగా వుంటే మరింత హెచ్చు ఉష్ణోగ్రతలు సాధించవచ్చు. ఈ సూత్రాలను ఉపయోగించి 1600 డిగ్రీల సెలిసియస్ ఉష్ణోగ్రతలు ఏర్పరచగలిగారు. దానితో భారీగా ఉక్కు ఉత్పత్తి వీలయ్యింది.

ఇప్పుడు శిలాజ ఇంధనాల సహాయంతో ఆక్సిజన్ అధికంగా గల గాలిని బాగా వేడి చేసి ఉపయోగించి ఇంకా హెచ్చు ఉష్ణోగ్రతలను సాధిస్తున్నారు. మామూలు ఉష్ణోగ్రతల వద్ద జరగని చర్యలు ఎన్నో అధిక ఉష్ణోగ్రతల వద్ద జరుగుతున్నాయి. పైగా చర్య జరిగే రేటు ఉష్ణోగ్రతతో పెరుగుతుంది. ప్రతి పది డిగ్రీల సెలిసియస్ ఉష్ణోగ్రత పెరుగుదలకు చర్యావేగం దాదాపు రెట్టింపు అవుతుంది. ఇది ఎంతో గొప్ప ప్రయోజనాన్ని తెచ్చి పెడుతుంది.

ఉదాహరణకు మన ఇంట్లో వాడుకునే ప్రెషర్ కుక్కరు తీసుకుందాం. నీటి మరుగు ఉష్ణోగ్రత కేవలం 30 నుండి 40 డిగ్రీల సెలిసియస్ పెరిగే సరికి వంట ఎంత వేగంగా జరుగుతున్నదో మనకు అనుభవంలోని విషయమే.

**ద్రవస్థితిలో చర్యలు సులువు:**

హెచ్చు ఉష్ణోగ్రతల వల్ల ద్రవస్థితికి అనేక ఘనపదార్థాలు వస్తాయి. ద్రవస్థితిలో పదార్థాలను వేరు చేయడం, సేకరించడం చాలా తేలిక. అంటే ద్రవస్థితిలో వున్న లోహాన్ని ఇతర మలినాల నుండి విడదీయడం సులువు. అదే ఘనస్థితిలో ఉంటే ఈ పని చేయడం కష్టం అవుతుంది.

అందుకే చాలా పరిశ్రమల్లో ఉత్పత్తులు త్వరితగతిని సాధించేందుకు హెచ్చు ఉష్ణోగ్రతలను ఏర్పరుస్తున్నారు. అనేక శక్తి మార్పిడి విధానాలు ఆసరా చేసుకుని హెచ్చు ఉష్ణోగ్రతలు సృష్టిస్తున్నారు. ఇంధనాలను దహనం చెందించి అధిక ఉష్ణోగ్రతలను ఏర్పరచడం అందులో ఒక పద్ధతి.

ఇతర శక్తి రూపాలయిన విద్యుత్, యాంత్రిక శక్తి, అతి ధ్వని తరంగాలు, అనేక వికిరణాలు, సౌరశక్తి వీటన్నిటిని కూడా ఉష్ణ శక్తిగా రూపాంతరం చెందించి కావలసిన హెచ్చు ఉష్ణోగ్రతలను పొందగల్గుతున్నారు.

ఇవన్నీ సైద్ధాంతికంగా హెచ్చు ఉష్ణోగ్రతలు ఏర్పరచగలవని చెప్పుకోవచ్చు. ప్రయోగాత్మకంగా వచ్చేసరికి అనేక హద్దులు ఏర్పడతాయి. ఎందుకంటే ఇంతటి ఉష్ణోగ్రతలు తట్టుకోగల పదార్థాలు అవసరమవుతాయి.

రెండువేల డిగ్రీల సెలిసియస్‌ను తట్టుకుని ఉండగల పదార్థాలు ఎక్కువ కాలం మన్నేవి చాలా తక్కువ వున్నాయి. కొంత ఉష్ణోగ్రత హద్దు దాటితే ఏ పదార్థమైనా సులువుగా లొంగిపోయి పరిసరాలతో చర్యకు దిగిపోయి దాని ధృడత్వాన్ని, కాఠిన్యతను కోల్పోతుంది.

ఉదాహరణకు గ్రాఫైటు 2200 డిగ్రీలు, మెగ్నీషియా 1900 డిగ్రీలు, మేగ్నసైటు 1900 డిగ్రీలు, ఫైర్‌క్లే 1500 డిగ్రీల సెలిసియస్ వరకూ మాత్రమే తట్టుకోగలవు.

**హెచ్చు ఉష్ణోగ్రతలు పొందే విధానం:**

ప్రయోగశాల లేదా పరిశ్రమలలో ఇంధనం దహనం చెందించి గాని విద్యుత్‌ను ఉపయోగించి గాని హెచ్చు ఉష్ణోగ్రతలు సాధిస్తారు. ఇంధనం దహనం చెందించే ప్రక్రియలో దానికి సరఫరా చేసే గాలి, ఆక్సిజన్‌లను అదుపు చేసి ఎంత ఉష్ణోగ్రత కావాలో అంత సాధించగల్గుతారు. అయితే ఆశించిన విధంగా అదుపు ఉండదు.

విద్యుత్‌తో ఏర్పాటు చేసే అధిక ఉష్ణోగ్రతల విషయంలో అదుపు సులువుగా చేయవచ్చు. కాని ఉష్ణోగ్రతను యాజమాన్యం చేసేటప్పుడు ఎగుడుదిగుడులు చాలా ఉంటాయి.

విత్యుత్‌తో ఉష్ణాన్ని సృష్టించడానికి నిరోధాన్ని వేడి చేయడం, ప్రేరణతో వేడి చేయడం, విద్యుత్ చ్ఛాలకం ద్వారా వేడి చేయడం, ఎలక్ట్రాన్ పుంజంతో వేడి చేయడం చేస్తారు.

ఈ విధంగా సృష్టించిన అతి ఉష్ణంతో రసాయనికంగా ఎన్నో ప్రయోజనాలు సాధిస్తున్నారు.

# యుగయుగాలుగా రూపాంతరం చెందిన శకుంతల

## మూలం : ప్రొఫెసర్ రోమిలా థాపర్

రివ్యూ : ఎ. అరుణ, రిసెర్చిస్కాలర్ అనువాద, సమగ్రీకరణ: బి. వి. రామిరెడ్డి
యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్.

సాహిత్య రచనలు ఊహాజనితాలనీ, కల్పితాలనీ, ప్రాచీన సామాజిక విషయాలను అర్థం చేసుకునేందుకు అవి ఏ మాత్రమూ ఉయోగపడవనీ చాలమంది నమ్మకం. అవి సాహిత్య, సామాజిక, చారిత్రక పరిణామాల అధ్యయనానికి పనికిరావని వారు భావిస్తారు. కాని, సాహిత్య రచనలు ప్రాచీన సంస్కృతుల్ని ప్రతిబింబింపజేస్తాయనీ, గుర్తుచేస్తాయనీ మర్చిపోకూడదు. అనేక కాలాలకూ, దేశాలకూ, చెందిన రచయితలు, తమ రచనల్లో వాటిని ప్రతిబింబింప జేశారు. అందుచేత అలాంటి రచనలు సాహిత్యాన్ని, చరిత్రను అధ్యయనం చేసే విద్యార్థులకు ఆయా కాలాల, దేశాల సంక్లిష్ట సంస్కృతుల్ని, వాటి పరిణామ క్రమాలను తెలియజేస్తాయి. ఆరకంగా సాహిత్య, చరిత్ర విద్యార్థులకు వాటి అధ్యయనం చాలా అవసరం. కావ్యాలలోని పాత్రలు, కావ్య వస్తువులు, కాలానుగుణంగా, మార్పులతో చేర్పులతో, పాఠకుల, ప్రేక్షకుల అభిరుచులనుబట్టి రూపు దిద్దుకుంటాయి.

పురాణ గాథలు, కావ్య వస్తువులు, పాత్రలు యుగయుగాలుగా రచయితల ఊహా ప్రపంచాన్ని ఆకట్టుకుంటున్నాయి. వివిధ కాలాలలో, వివిధ దేశాలలోని రచయితలు, ఆ కావ్య వస్తువులను, గాథలను, పాత్రలను తీసుకుని, కావ్య వస్తువును పెంచి కావ్యాలు రచించారు. కిరతార్జునీయం. అభిజ్ఞాన శాకుంతలం అలాంటివే. ఇవి మన దేశభాషలలో, అనేక మార్పులు చేర్పులతో కనిపిస్తున్నాయి. ఈ పురాణ గాథలు, పాత్రలు కాలానుగుణంగా తీసుకున్న మార్పుల్ని, చేర్పుల్ని మన సాహిత్య విమర్శకులు దర్శింప జేస్తున్నారు, అందుకు కారణమైన సామాజిక ప్రభావాలను విశదీకరిస్తున్నారు.

ప్రొఫెసర్ రోమిలా థాపర్ రచించిన - ''శకుంతల - రచనలు, విమర్శలు, చరిత్రలు'' అలాంటి గ్రంథమే. ఈ పుస్తకం సాహిత్యానికి సంస్కృతికీ చరిత్రకు మధ్యగల అవినాభావ సంబంధాన్ని విశదీకరిస్తున్నది. సాంస్కృతిక చరిత్ర అధ్యయనానికి ఈ పుస్తకం ఎంతగానో దోహదం చేస్తున్నది. భారతీయ పురాణ కావ్యమైన మహాభారతంలోని శకుంతల పాత్ర, చరిత్రకంగా, భారతీయ, విదేశీయ సాహితీ సంప్రదాయాలలో ఎన్ని మార్పులకు, చేర్పులకు లోనయిందో రచయిత్రి తనదైన శైలిలో వివరించారు.

మహాభారతంలోని అనేక ఉపాఖ్యానాలలో, ఆదిపర్వంలోని శకుంతలోపాఖ్యానం సుప్రసిద్ధ మయినది. ఇది ఒక ఉపాఖ్యానమైనప్పటికి, ప్రాచీన కాలంలో ఈ గాథకు గొప్ప ప్రాచుర్యం లభించింది.

నిలునుడి కుమారుడైన దుష్యంతుడు అసాధారణ శక్తి యుక్తుడు. ఒక రోజు అతడు మృగయా వినోదార్థం, సైన్య సమూహంతో, కణ్వాశ్రమ సమీపానగల అరణ్యంలో భీభత్సంగా మృగాలను వేటాడి,

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

అలసి, కణ్వాశ్రమానికి వచ్చి ఆ ఆశ్రమ సౌందర్యానికి, ప్రశాంతతకు ముగ్ధుడై, సామగానలతో, వేద ధ్వనులతో, మీమాంసా గోష్ఠులతో శ్రవణ పేయంగా ఉన్న ఆశ్రమంలో కణ్వమహర్షికి నమస్కరించి వెళ్ళామనే సద్భావనతో పరిజనాన్ని వనం వెలుపల నిలువరించి, ఒంటరిగా ఆశ్రమ ప్రాంగణానికి చేరుకుని ''సంకులమిళితాళినీల పరికుంచిత కోమల కుంతలయైన'' శకుంతలను చూస్తాడు. ''జయంతుండ పోలి'' అందగాడైన దుష్యంతునికి ఆర్ఘ్య పాద్యాదులతో అతిథిమార్యదలు చేస్తుంది. ''క్రచ్చఱవేట వచ్చి యిట కణ్వమహాముని జూచిపోవగా వచ్చితి యెందుబోయిరోకో వా'' రని శకుంతల నడుగుతాడు. అడవిలోకి పండ్లు తేవడానికి వెళ్లారు, ఇప్పుడే వొస్తారు ఒక్క ముహూర్తకాలంలో అని చెబుతుంది. ''మనో రాజ్యలక్ష్మి'' లాగ ''సర్వలక్షణ లక్షితంబులయిన సర్వావయవంబులం జూచి, సంచలిత హృదయుడై'' నీవెవ్వరి కూతురివి? ఈ ఆశ్రమంలో ఎందుకున్నావని ప్రశ్నిస్తాడు? అపుడు శకుంతుల, తన పెంపుడు తండ్రియైన కణ్వమహాముని, ఒక మునీంద్రుడిలాగే అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలియజేసిన తన జన్మ వృత్తాంతాన్ని నిస్సంకోచంగా తెలియజేస్తుంది. అప్పటివరకు ''ఇది మునినాథ కన్యయని యెంతయో నిస్పృహవృత్తి నున్న'' దుష్యంతుడు ఆమె 'రాజపుత్రి' అని తెలియగానే, నీకు ఈ ఆశ్రమవాసమూ, వల్కలాజినాలూ ఉచితంకావు, నాకు భార్యవై 'అశేష రాజ్యలక్ష్మీ మహానీయ సౌఖ్యా'లనుభవించమంటాడు. మదనాతురుడై, అష్టవిధ వివాహాలను గురించి ఆమెకు వివరించి, తమకు అనకూలమైన గాంధర్వ విధిని వివాహం చేసుకుందాం అంటాడు. ఆమె సంస్కారవంతురాలైన ఆడపడుచు కాబట్టి మా నాన్నగారు వొచ్చాక వారి అనుమతితో తన పాణి గ్రహణం చేయమంటుంది. దుష్యంతుడు రహస్య పద్ధతి సమంత్రకము అయిన గాంధర్వ వివాహం గురించి చెప్పి, ఆమెను మానసికంగా వొత్తిడికి గురిచేస్తాడు. శకుంతల ఆడపిల్లగా, తన భవిష్యరక్షణ గురించి భయ సందేహాలతో, పురుష స్వభావాన్నెరిగి, తనకు జన్మించ బోయే పుత్రుడికి యౌవరాజ్య పట్టాభిషిక్తుని చేస్తానని వరమిమ్మని కోరుతుంది. మదనాతురుడైన దుష్యంతుడు వెంటనే ఆమె కోరిన వరమిచ్చి ''గాంధర్వ వివాహంబున నభిమత సుఖంబులనుభవించి'', ఆమెను తన వద్దకు రప్పించుకోవడానికి, కణ్వమహర్షి దగ్గరికి ప్రధానుల్ని పంపుతానని చెప్పి వెళ్ళిపోతాడు. అరణ్యంనించి వొచ్చిన తరువాత విషయాన్ని గ్రహించిన కణ్వుడు శకుంతల వివాహాన్ని సంతోషంగా అంగీకరించడమే గాక, ఆమె కుమారుడు 'వంశకర్త' అవుతాడని వరమిచ్చి, గర్భ సంస్కారాలు చేయించాడు.

మూడేళ్లు గడిచే పోయాయి.

భరతుడు జన్మించాడు. వాడు మూడేళ్ల వయసులోనే, క్షత్రియ పుత్రుడు కాబట్టి - ''వరహ వ్యాళ, శార్దుల ఖడ్గ మదేభా'' లను పట్టి తెచ్చి ఆశ్రమంలో చెట్లకు కట్టివేసి, ఆడుతే ఆశ్రమ శాంతిలో కలకలం సృష్టిస్తున్నాడు. కణ్వుడు - స్త్రీలు ఎక్కువకాలం పుట్టినిళ్ళలో ఉండడం ధర్మంకాదనీ, భర్త సన్నిధిలో ఉండడమే భార్యా ధర్మం అని బోధించి, తపోధనులైన తన శిష్యుల్ని తోడిచ్చి శకుంతలను దుష్యంతుడి దగ్గరికి పంపుతాడు. ''సకల సామంత మంత్రి పురోహిత ప్రధాన పౌరజన పరివృతు''డై ఉన్న దుష్యంతుని సభకు వచ్చి, తనను ఎరుగనట్లు చూచిన రాజు ప్రవర్తనకు విస్తుపోయి శకుంతల ''ఎఱుంగడోకో నన్ను నెఱిఁగియు నెఱుగని యట్లుండు నొక్కొ'' అనుకుని, అయినా ''బహుభార్యా

మగ్ను''లైన రాజుల మనస్తత్వాలిలానే ఉంటాయిలెమ్మని సరిపెట్టుకుంటుంది. ఆరోజు, తమ గాంధర్వ వివాహానికి ముందు, తనకిచ్చినమాట తప్పదలచుకున్నాడా ఏమిటి?' మరచి పోతే గుర్తు చేయవచ్చు, మరచి పోయినట్లు నటించే వారికి ఎలాగుర్తు చేయడం? ఇక్కడి వరకూ వొచ్చాక ఊరకే తిరిగి పోవడం పద్ధతి కాదు. పూర్వవృత్తాంతాన్ని గుర్తు చేసి, కొడుకును చూపితే బాగుంటుందని, గత వృత్తాంతాన్ని గుర్తు చేసింది.

దుష్యంతుడు ప్రజాభిప్రాయానికి భయపడి, 'ఎఱిగియు నెఱుగనివాడి' లాగ నీవు నాకు తెలియవు, వొచ్చిన చోటికే పొమ్మన్నాడు. శకుంతలకది చావు బ్రతకుల సమస్య. ఆమెకు విపరీతమైన కోపం వొచ్చింది. అయినా తన విచక్షణాజ్ఞానాన్ని కోల్పోలేదు. స్థిత ప్రజ్ఞురాలై, ఓరిమితో నిలిచి, అతనికి ధర్మబోధ చేసింది.

''అంతా చేసి, ఏమీ ఎరగనట్లు మాట్లాడడం ధర్మాన్ని కాపాడవలసిన ధార్మికులైన రాజులకు సబబుకాదు. వేదాలు, పంచభూతాలు, ధర్మం, సంధ్యలు, అంతరాత్మ, యముడు, సూర్యచంద్రులు, రాత్రింబవళ్ళు పురుషవృత్తాన్ని గమనిస్తుంటాయి. అలాంటప్పుడు మనుష్యుడు తననించి తాను దాక్కొనడం ఎలా సాధ్యం? నాకిచ్చిన వరాన్ని గుర్తు తెచ్చుకో. భార్యా పుత్రులతో సతతం గృహమేధి ఫలాన్ననుభవిస్తాడు. అదీగాక, పురుషార్థాలైన ధర్మార్థకామ మోక్షసాధనకు గృహ జీవితనీతి విద్యే మూలం. భార్య పురుషుడిలో అర్ధ భాగం. పతివ్రతయైన భార్య నవమానించడం ధర్మవిరోధం. పురుషుడు భార్యలో ప్రవేశించి ఆమె గర్భం నుండి పుత్రుడై తాను జన్మిస్తాడు. అందుకే వేదాలు ''నజ్ఞాదజ్ఞాత్సమ్భవసి'' అని ఘోషిస్తున్నాయి. ''పున్నామ్నో నరకాత్త్రాయత ఇతి పుత్ర్ర' అన్న వేదవాక్యాన్ననుసరించి పుత్రుడు ఉభయ పక్షాలవారిని ఉద్ధరిస్తాడు. నీ శరీరం నుండి ఆకారాన్ని పొందిన ఈ పుత్రుడు ఒక దీపం వలన వెలిగింపబడిన మరియొక దీపం లాంటివాడు.

ఇన్నిమాటలెందుకు, వెన్నెలకన్న, కర్పూరసాంద్రపరాగం కన్న ఎక్కువ సుఖానిచ్చే పుత్ర పరిష్వంగ సుఖాన్ననుభవించు. వీడు నూరు వాజపేయాలు చేసి నీ వంశ ప్రతిష్ఠను ఇనుమడింప జేస్తాడు. స్వయంగా సరస్వతీ దేవి ఈ మాటలన్నది. నూరు ఉప్పు నీటి బావులకంటె ఒక మంచినీరు బావి, నూరు మంచినీటి బావులకంటే ఒక యజ్ఞం, నూరు యజ్ఞాలకంటే కుమారుడు, నూరుగురు కుమారులకంటె ఒక సత్యవాక్యం ఉన్నతమైనది. నూరు అశ్వమేధయాగఫలాని కన్న ఒక్క సత్య వాక్యం మిన్న. సర్వతీర్థ దర్శనానికంటె సత్యమే గొప్పది. క్షత్రియ ఋషియైన విశ్వామిత్రునకు, పవిత్రయైన మేనకకు పుత్రికనయిన నేను అబద్ధ మాడటం లేదు'' అంటుంది. ఇంత ధర్మబోధ చేసినప్పటికీ ప్రజాభిప్రాయానికి భయపడ్డ దుష్యంతుడు నిండు సభలో స్త్రీ తన అధర్మాన్నీ, అబద్ధబుద్ధినీ, పిరికితనాన్నీ ఎండగట్టి ధర్మ ప్రబోధం చేస్తుంటే తట్టుకోలేక, పురుషాహంకారం కరుడుగట్టి, కఠినుడై - నీ వెవరు నేనెవరు? ''మానిను లసత్యవచనులు'' అని ఎదురు దాడికి దిగాడు. పైగా అందరు నవ్వేట్టుగా కొడుకును చూపుతావా తగుదునమ్మాఅని. నీ ఆశ్రమానికి తిరిగి వెళ్ళిపో అని కసిరాడు. అంతలో అశరీరవాణి అసలు విషయాన్ని అందరికి వినిపించి శకుంతలను దుష్యంతుణ్ణి రక్షించింది. లేకపోతే సత్యాగ్రహి అయిన శకుంతల వృత్తాంతం వేరే విధంగా ఉండి వుండేది.

మహాభారతంలోని శకుంతల ధైర్యశాలిగా, ధర్మబద్ధగా, పతివ్రతగా, స్థిత ప్రజ్ఞురాలిగా, విజ్ఞత విచక్షణా బుద్ధి గలదానిగా, అన్యాయాన్నెదురించి న్యాయం కోసం పోరాడిన ధీశాలినిగా చిత్రించబడింది. తరువాతి కాలంలో కాళిదాస మహాకవి ''అభిజ్ఞానశాకుంతలం'' నాటకాన్ని వ్రాశాడు. మహాభారత కథనే తీసుకున్నా, కాళిదాసు తనకాలపు ఫ్యూడల్ వ్యవస్థ కనుగుణంగా, బ్రాహ్మణ సంస్కృతిని ప్రచారం చేసేందుకు ఈ నాటకాన్ని రచించాడు. ఆ కాలపు సామాజిక అభిరుచుల కనుగుణంగా, సామాజిక లక్షణాలు ప్రతిబింబించే విధంగా కథలోను, పాత్ర చిత్రణలోను మార్పులు చేర్పులు చేశాడు. దుర్వాసుడి శాపం, అంగుళీయ వృత్తాంతం అలాంటివే. అంగుళీయాన్ని పోగొట్టుకోవడం మరుపుకు ప్రతీక. ఆ విధంగా దుష్యంతుడు, శకుంతలల సంగమం ఆలస్యమవుతుంది. మూలకథలో లేని ఆశ్రమ వాసినులైన సహచారిణులకు, శకుంతలకు; శకుంతలకు ఆశ్రమంలోని పశుపక్ష్యాదులకు వృక్షసంతతికిగల అతిసుకుమారమైన ఆత్మీయతా బంధాన్ని, కాళిదాసు హృద్యమంగా చిత్రించాడు. అంతేగాక శకుంతలను తాపసులను తోడిచ్చి అత్తవారింటికి పంపే ఘట్టంలో, పెంచిన ప్రేమ బంధపు సుకుమారమైన బాధలో కణ్వమహర్షి స్పందన, వివాహానంతరం తమకుమార్తెలను అత్తవారింటికి పంపుతూ అప్పగింతలు పెట్టేఘట్టంలో దుఃఖించే తల్లి దండ్రులందరి హృదయాలను కన్నీటి ప్రవాహంలో కొట్టుకు పోయేట్టే చేస్తుంది.

కాళిదాసు శకుంతల పాత్ర చిత్రణలోను ఎంతో మార్పు చేశాడు. కాళిదాసు నాటకం పండితులు, ఉన్నతవర్గాల వారికోసం వ్రాయబడింది. ఈ నాటకం మధ్య తరగతి ప్రేక్షకుల దగ్గరికి వొచ్చేటప్పటికి, శకుంతలా దుష్యంతుల రహస్య గాంధర్వ వివాహం విషయంలో నీతి సమస్య తలయెత్తింది. ఈ నీతి భయం వల్లనే దుష్యంతుడు శకుంతలను ఎరుగనట్టు మాట్లాడడం. ప్రజాభిప్రాయానికి భయపడడం వల్లనే దుష్యంతుడు అలా మాట్లాడాడని శకుంతలకూ తెలుసు, మనకూ తెలుసు, దుష్యంతుడికీ తెలుసు.

అదీగాక కాళిదాసు శకుంతలను పిరికిదానిగా, మెత్తని స్వభావం గల దానిగా, నమ్రతగలదానిగా, పురుషుడి నిరాదరణకు గురియై ఓర్పుగా నిరీక్షించే స్త్రీగా మార్పుచేశాడు. కాళిదాసు అలా మార్చకపోతే తన సమకాలీన పండితులు, చక్రవర్తులు, సామాజికులు తన కావ్యాన్ని ఆదరించరని తెలుసు. సాహిత్యం, అది ఏకాలానికి చెందినదైనా, సమాజానికి దర్పణం అని విజ్ఞులు అంటున్నారు. ఆ రకంగా, కాళిదాసు తన కాలపు సమాజపు నమ్మకాలకు, విలువలకు, అభిప్రాయాలకు అనుగుణంగానే శకుంతల కథలోను, పాత్రలోను మార్పులు చేసుకున్నాడు.

పైగా భాష విషయంలోను కాళిదాసు ఎంతో జాగ్రత్త వహించాడు. కుల వ్యవస్థతో నిండిన ఈ దేశంలో భాష కూడా కులపరంగానే వాడబడింది. కాళిదాసు తన నాటకంలో నాయకుడు, ఇతర ఉన్నత కుల పాత్రలు స్వచ్ఛమైన గ్రాంధిక భాషలో మాట్లాడితే, నిమ్నకులాలకు చెందిన సాధారణ పాత్రలు వాడుక భాషలో మాట్లాడతాయి. ఈ నాటకంలో జాలరివాడు తాను అంగుళీయాన్ని దొంగతనం చేయలేదంటూ వేడుకునే సందర్భంలో వాడుపయోగించిన భాష అలాంటిదే. ఏది

ఏమయినప్పటికి, కాళాదాసు ''అభిజ్ఞాన శాకుంతలం'' మొత్తం సంస్కృత సాహిత్యంలోనే అత్యుత్తమ కావ్యంగా ఎంచబడింది. కాళిదాసు సమకాలీనులేగాక 18వ శతాబ్దపు పాశ్చాత్య పండితులు కూడా ఆ విషయాన్ని అంగీకరించారు. ఈ నాటకాన్ని చదివి ముగ్ధుడైన ప్రఖ్యాత జర్మన్ రచయిత, కవి, పండితుడు - గెథె కాళిదాసును 'ఆసియాజ్యోతి'గా అభివర్ణించాడు. ఈ నాటకం మీద విస్తృతమైన విమర్శలు, సమీక్షలు వ్రాసిన పాశ్చాత్య పండితులు మాక్సుముల్లర్ లాంటి వారెందరో ఉన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే వారు శాకుంతలం నాటక ద్వారం ద్వారా మన పురాణ, ఉపనిషత్, వేద సాహిత్యం దాకా ప్రయాణించారు. కాళిదాసు కవితాత్మక నాటకంలోని సౌందర్యాకర్షణ అంత బలమైనది.

శంకుతల కథ భాగవత పురాణం, కథాసరిత్సాగరం, తొమ్మిదవ శతాబ్దపు నాట్య శాస్త్రాల్లోనేగాక, మధ్య యుగానికిచెందిననూజ్‌కాలేశ్వర(హిందీ), మిర్జా ఖాసి అలీ (ఉర్దూ)లోనూ; యూరోపియన్ భాషలైన లాటిన్, ఆంగ్లం, జర్మన్, రష్యన్ భాషలలోకి అనువదింపబడింది. ప్రపంచవ్యాప్తంగా ఈ నాటకం పాఠకులను అలరించింది. పాశ్చాత్య సాహిత్యంలో కూడా శకుంతల పాత్ర ఎన్నో మార్పులకు లోనయింది. ఆంగ్లేయులు, జర్మన్లు ఆమెను అతిలోక సౌంధర్య రాశిగా ప్రకృతి వొడిలో పెరిగిన ముగ్ధగా చిత్రించుకున్నారు. జర్మన్లు ఆమెను ప్రకృతి మాత బిడ్డగా భావించారు.

ప్రొ॥ రోమిలా థాపర్ తన గ్రంథంలో అనేక చారిత్రిక ఉద్యమాలలో శకుంతల పాత్ర చిత్రణ ఎన్ని విధాలుగా మారు రూపాలు పొందిందో విమర్శనాత్మకంగా నిరూపించారు. మహా భారతంలోని శకుంతల వాఖ్యానాలు, పురాణ ప్రవచనాల ద్వారా సామాన్య ప్రజల హృదయాల్లో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంది. ఈమెకు నిండైన వ్యక్తిత్వంగల మహాభారతంలోని శకుంతుల అంటేనే అభిమానం. తరువాత కాలాంతర్గతంగా వొచ్చిన రచనలో స్త్రీగా శకుంతల పాత్రను పతనం చేయడాన్ని థాపర్ నిరసించింది. ఆ పాత్రను అలా విస్మరించడాన్ని రచయిత్రి అంగీకరించలేదు.

ఈ పుస్తకం మొదటి భాగంలో మహాభారతంలోని శకుంతల పాత్ర చిత్రణకు, కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలోని పాత్ర చిత్రణకు మధ్యగల తేడాలను ఇతర భాషలలో, సమకాలీన సాంప్రదాయాల ననుసరించి కథలోని ఆదర్శాలను అన్వయించిన విధానాలు వివరించబడ్డాయి. రెండవ భాగంలో కాళిదాసు నాటకం మీద వచ్చిన విమర్శలు, సమీక్షలు, అనుభూతిపరమైన రచనలు; ప్రాచ్య పాశ్చాత్య పండితులు, అనువాదకులు, విద్వాంసులు వెలువరించిన రచనల్ని గురించి పరామర్శవుంది. అనేక రచనలలో ఈ కథా సంవిధానం జరిపిన తీరును రచయిత్రి తనదైనశైలిలో హృద్యంగా వివరించారు. ఈ పుస్తకం చరిత్ర విద్యార్థులేగాక అందరూ చదవదగింది.

పురుష స్వామ్య సమాజాన్ని, పురుషాహంకారాన్ని తృప్తిపరిచేందుకు ఎన్ని మార్పులు చేసినా, పురుషుడి జీవితంలో అర్ధభాగంగానే గాక మొత్తం విశ్వంలో, ప్రకృతిలో సృష్టి, స్థితి, లయ లకు మూలమైన స్త్రీని తక్కువగా చూసినంత కాలమూ మానవ సమాజానికి నిష్కృతి లేదు. అందుకే నేటికీ మహాభారతంలోని శకుంతలే మనకు ఆదర్శనీయురాలిగా కనిపిస్తుంది.

# హిందూయిజం-ఒక పరిశీలన

మూలం: తర్క తీర్థ లక్ష్మణ శాస్త్రి జోషి                    తెలుగు: డా॥ ఎన్. ఇన్నయ్య

(గతసంచిక తరువాయి)

వేదాలలో ఆశ్రమ ధర్మాలు కనిపిస్తాయి. అయితే వేదకాలానికి విద్యార్థి, గృహస్థ స్థాయిలే గుర్తింపబడినవి. ఉపనిషత్తులలో నాలుగు దశలూ వచ్చాయి. ఒక సందర్భంగా గృహస్థు ధర్మాన్నొక్క-దానినే వేదాలలో గుర్తించారు. గౌతమ ధర్మ సూత్రాల ప్రకారం మిగిలిన ధర్మాలు నిరాకరించారు కూడా. బ్రహ్మచారిదశ జ్ఞానార్జనకు ఉద్దేశింపబడిందని ఋగ్వేదంలో రెండు ప్రస్తావనలు వున్నాయి. బ్రాహ్మణాలు, అధర్వణ వేదంలో వివరంగా యీదశ గురించి ప్రస్తావన ఉన్నది. నాలుగు ఆశ్రమాల గురించి చాందోగ్యోపనిషత్తు చెబుతుంది.

వానప్రస్థం, సన్యాసం అనేవి ఆర్యేతర సంస్కృతి నుండి ఆర్యులు గ్రహించారు. వీటిని తమలో యిముడ్చుకోటానికి ఆర్యులకు చాలా కాలం పట్టింది. ఆర్యులు నాగరికులు కాక పూర్వమే, ఈజిప్టు, ఇరాన్, ఇండియాల్లో ఆర్యేతరులు అత్యున్నతంగా నాగరికత పెంపొందించారు. వీరి నాగరికత వేద నాగరికతపై ప్రగాఢ ముద్ర వేసింది. ఎంతో జ్ఞానాన్నీ, ఆచారాల్నీ, సంప్రదాయాల్నీ, ఆర్యులు స్వీకరించారు. సామాజిక పరిస్థితులవలన ఆర్యులు సన్యాస ధర్మాన్ని స్వీకరించాల్సి వచ్చింది.

స్మృతి సాహిత్యంలో షోడశ (పదహారు) కర్మకాండలు కనిపిస్తాయి. స్మృతులన్నింటికంటె ముందు వచ్చిన గౌతమ ధర్మ సూత్రంలో యజ్ఞాన్ని కూడా కర్మకాండగా భావించారు. అట్లాంటివి 40 ఉన్నాయన్నారు. 16 కర్మకాండలు అధర్వణ వేదంలోనివి. కౌశిక, గుహ్య సూత్రాలలో వీటిని విస్తారంగా ప్రస్తావించారు. తొలి గుహ్య సూత్రాలలో ఇట్లాంటి ప్రస్తావనే లేదు. ఈ 16 కర్మకాండలు కాక ఆదిమ జీవితాన్ని సూచించే సూలగవ ఉన్నది. కుల కర్మాచారాలలో నామకరణం, ఉపనయనం, వివాహం, అంతే తుష్టి (mortnary rites) ఇవన్నీ ఆఫ్రికా, ఆస్ట్రేలియా, పసిఫిక్ దీవుల ఆదిమ జాతులలో వున్నాయని ఆదిమ మానవ శాస్త్రంలో యాత్రికుల వ్రాతలలో గోచరమైనవి.

**వర్ణవ్యవస్థ:**

ఋగ్వేదంలో వర్ణ సిద్ధాంతపు బీజాలున్నవి. నాలుగు వర్ణాల విషయం వేదాలలో తరువాత వచ్చింది. తొలిదశలో బ్రహ్మ, క్షత్రియాలు కలసి ప్రస్తావించారు. ఆర్య వర్ణం, దశ వర్ణం ప్రస్తావన కూడా ఒక చోట ఉన్నది. దశ వర్ణమే శూద్రులు. వేద సాహిత్యమంతా నిశిత పరిశీలన చేస్తే, తాము జయించిన వారితో ఒక కొత్త వర్ణాన్ని ఆర్యులు సృష్టించారని గ్రహించవచ్చు. ఆర్యులు యజమానులు. జయింపబడిన వారే బానిసలు. ఆర్యులలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఉండగా, సమాజాధిపత్యమంతా బ్రాహ్మణ, క్షత్రియుల పరంగా ఉండేది. ఆర్యుల ఆధిపత్యాన శ్రమ చేసే బాధ్యత శూద్రులది. అట్లా సామాజిక నియమాలు, కట్టుబాట్లు విధించారు. వేదయజ్ఞం చేసే హక్కు ఆర్యులు అట్టిపెట్టుకున్నారు. అంతేగాని, ఆర్యేతరులు వెనుకబడినందున గానీ, ఆదిమవాసులు అయినందునగానీ హీనస్థితి వచ్చినదనటం సరికాదు. ఆర్యేతరులు వ్యవసాయం, ఇంకా కళలలో నిపుణులు. వారికి విస్తృత సామ్రాజ్యాలుండేవి. అందులో కొన్నింటిని ఆర్యులు

డా॥ ఎన్. ఇన్నయ్య, హైదరాబాదు, హేతువాది, రచయిత, ప్రముఖ పాత్రికేయులు.

జయించారు. ఆర్యుల ఆధిపత్యం క్రిందకు వచ్చిన సామ్రాజ్యాలలో వర్ణ వ్యవస్థ సృష్టించారు. ఆవిధంగా సమాజంలోని సంపద, గౌరవం, అధికారం ఆర్యులకు దక్కింది. వ్యవసాయం ఇతర కళలలో ఆరితేరిన 75% మంది బానిసలయ్యారు.

వేదేతరుల్ని తమ ఆధిపత్యం క్రిందకు తీసుకురావటంలో మతాన్ని అడ్డం పెట్టుకున్నారు వేద ప్రజలు. వేద యజ్ఞాలు ఇందుకు బాగా ఉపకరించాయి. యజ్ఞం నిమిత్తం ప్రజాపతి సంపదను కొల్లగొట్టారు. శూద్రులు గోవు పాలు పితికినా అవి యజ్ఞానికి పనికిరావన్నారు. శూద్రుడిని తనయిష్టమొచ్చినట్లు శిక్షించటానికి (సమాజం నుండి వెళ్ళగొట్టటానికి) వేద ఆర్యునకు హక్కువున్నది.

వ్యవసాయం, చేతివృత్తులు, అగ్రవర్ణాల సేవ శూద్రుని విధులు. వ్యవసాయం ప్రధానవృత్తి అయినా, శ్రమ ఫలితాన్ని శూద్రుల్ని అనుభవించనివ్వలేదు. నిరంకుశ నియమాల ఆధారంగా, శూద్రులు ఉత్పత్తి చేసినదంతా ఆర్యులు భుక్తం చేసుకున్నారు. ఇతరులతో పోల్చి చూస్తే శూద్రుల సంపదను కొల్లగొట్టారు. స్మృతులననుసరించి 60% వడ్డీ శూద్రులనుండి రాబట్టారు.

వేదేతరుల బానిసత్వాన్ని అట్టిపెట్టటానికి వేదప్రమాణాన్ని వాడుకున్నది స్రౌత - స్మార్త మతం. వేద ప్రమాణాలను సమాజానికంతటికి విస్తరించటానికి వారు అంగీకరించలేదు. వేదేతరులను వేదప్రజలుగా మార్చటానికి అనువుగా, సామ్యవేదంలో తండ్య బ్రాహ్మణం వ్రతయాస్తోమ కాండ, కాత్సాయన స్రౌత సూత్రం పేర్కొన్నవి. కాని ఇది చాలా అరుదుగా వాడారు. తొలి సూత్రాలు, స్మృతులననుసరించి శూద్రులు వేదం చదివితే ఉరిశిక్ష విధించేవారు.

వేద యజ్ఞం చేసి, స్మృతి మతాన్ని పాటించే ఆర్యుడు సమాజాధిపతి. పుట్టుకచే అతను వేదమతాన్ని అనుసరించే హక్కు పొందాడు. తత్ఫలితంగా ఆధిక్యత, యాజమాన్యం లభించాయి. పౌరోహిత్యం వలన బ్రాహ్మణాధిపత్యం వచ్చింది. బ్రాహ్మణుడనగా నిస్వార్థుడు, జితేంద్రియుడు, పండితుడు, ఋషి అని వాదించేవారున్నారు. స్రౌత - స్మార్త ధర్మం ప్రకారం ఇది సరి కాదు. ఇతర వర్ణ స్త్రీలతో వ్యభిచరించిన బ్రాహ్మణునకు ఈ ధర్మం స్వల్ప శిక్ష విధించింది. అతడు ఆమెను వివాహమాడవచ్చు కూడా. శూద్ర స్త్రీలు బ్రాహ్మణునకు ఉంపుడు కత్తెలుగా ఉండవచ్చునని శ్రుతి, స్మృతులలో అత్యంత ముఖ్యమైనవి కూడా పేర్కొన్నవి. శూద్రుడు బ్రాహ్మణ స్త్రీతో గాని, ఇతర అగ్రవర్ణ స్త్రీలతో గాని వ్యభిచరిస్తే ఫలితం ఉరిశిక్షే. బ్రాహ్మణునకు ఉరిశిక్ష పడగల నేరమే లేదు. నిస్వార్థం, జితేంద్రియం, తపస్సు నుండి తప్పిన బ్రాహ్మణునకు తీవ్ర శిక్ష ఉండవలసింది. కాని శృతులు, స్మృతులు తద్విరుద్ధంగా చెప్పాయి. బ్రాహ్మణులు, ఇతర ఆర్యులు ఈ నియమాలననుసరించి చాలా హక్కులు, అవకాశాలు అనుభవించవచ్చు. సంపద, అధికారం, గౌరవం అనుభవించడంలో బ్రాహ్మణులకు గల అవకాశాలు ఇంకెక్కడా లేవు. స్మృతులననుసరించి బ్రాహ్మణ ధర్మాలుగా పేర్కొనబడేవి అంత ప్రధానం కాదు. వేదపఠనం, పౌరోహిత్యం మాత్రమే విలువగా పరిగణించబడినవి. న్యాయ నిర్ణేతలు బ్రాహ్మణులే. తప్పితే క్షత్రియులు, వైశ్యులు ఉండేవారు. ఎంత పండితుడైనా, శూద్రుడు న్యాయ నిర్ణేత కాజాలడని స్మృతులు నిక్కచ్చిగా చెప్పాయి. స్మృతుల ప్రకారం బ్రాహ్మణులకు వడ్డీలు, పన్నులు అతిస్వల్పంగా ఉండాలి. న్యాయంలో తొలుత

బ్రాహ్మణుల విషయం గమనించాలి. శూద్రుల వృత్తుల్ని బ్రాహ్మణులు, అగ్రవర్ణాలవారు చేపట్టవచ్చు. కాని అగ్రవర్ణాల వృత్తులు స్వీకరించే అర్హత శూద్రులకు లేదు. ఎంత కష్టంలోనైనా సరే, శూద్రులు పైవర్గాల వృత్తులు స్వీకరించటం తీవ్ర శిక్షకు గురిచేయబడేది.

ధర్మ సూత్రాలు, స్మృతులు వేద ఆర్యులపై వర్ణాశ్రమ ధర్మాలననుసరించి స్మృతుల సామాజిక నియమాలు వచ్చాయి. వేదాల్లో వీటి ప్రస్తావన స్వల్పం. సూత్రప్రాయంగా మాత్రం వేదాల్లో ఇవి ద్యోతకమౌతాయి. వేదాల్లో, ఉపనిషత్తుల్లో యజ్ఞకాండ, బ్రహ్మజ్ఞాన సూత్రాలు ఉన్నాయి. వేదకాలం క్రమేణా సూత్రాలు, స్మృతులు నియమాల్ని క్రోడీకరించాయి. వేద ఆర్యుల కాలపు సంప్రదాయాలు, నియమాలు, ఆచారాలు జ్ఞాపకం పెట్టుకొని, కూడగట్టటంతోనే 'స్మృతి' అని వచ్చింది. వేదాల్లో మంత్రాలు, కర్మకాండ, బ్రహ్మజ్ఞానం కలసి ఉన్నది. వేదాల అనంతరం స్మృతులు సేకరించారు. మంత్రాలు, బ్రహ్మణాలు వ్రాసేనాటికే స్మృతులు ఉంటే వాటినీ వేదాలనేవారే. స్మృతుల్లోని యీ ప్రాచీనత వలన, మనువుతో సహా సూత్రకారులందరూ స్మృతుల్ని వేదాల నుండి జనించినవిగా భావించారు. వేదాల అనంతరం స్మృతులలో చాలా మార్పులు జరిగాయి. పరాశరస్మృతి మినహాయిస్తే, మిగిలినవాటి మత నియమాలన్నీ ఇంచుమించు ఒకటే. గౌతమ, అవస్థంభ, వశిష్ఠ, శంఖలిఖిత, మను, యజ్ఞ వల్క్య, నారద, బృహస్పతి స్మృతులన్నీ వర్ణాల్ని, సామాజిక విధానాన్నీ గురించి చెప్పేది ఒకేతీరుగా ఉంటుంది.

వేదమతం అందరిమతం కాదు. అది కొందరికే పరిమితం. ప్రజలపై తమ ఆధిపత్యాన్ని అట్టిపెట్టుకోటానికి కొందరు వేదమతాన్ని తమ గుత్తసొమ్ముగా వాడుకున్నారు.

వేద ఆర్యుల సామాజిక విధానంలో బ్రాహ్మణాధిపత్యం, శూద్రుల లొంగుబాటు ప్రధాన్నమైనవి. బ్రాహ్మణాధిపత్యంపై వేదకాలంలోనే క్షత్రియులు తిరగబడ్డారు. కొందరు రాజులు బ్రాహ్మణాధి పత్యం తమకూ కావాలన్నారు. విశ్వామిత్రునకు, వశిష్ఠునకూ ఈ విషయంలోనే కలహం జనించింది. బ్రాహ్మణుల పెత్తనం కొంతవరకైనా క్షత్రియులకు సంక్రమించవచ్చునని విశ్వామిత్రుని కథ తెలుపుతున్నది. చాలా క్షత్రియ కుటుంబాలు బ్రాహ్మణ అంతస్థు పొందినట్లు పురాణాల వలన విదితమౌతుంది. బ్రాహ్మణులకు అధికంగా హక్కులు అవకాశాలు ఉండటం పట్ల కూడా క్షత్రియులు ఆక్షేపించారు. దీనికి వ్యతిరేకంగా అనేక మంది రాజులు పోరాడారు కూడా. యజ్ఞాలకు, పౌరోహితుల సంభావనలకు వ్యతిరేకంగా వేనరాజు పోరాడాడు. పన్నుల బారినుండి బ్రాహ్మణులు స్వేచ్ఛ అనుభవించటం సహించక, హైహయ, వైతాహయ రాజులు బ్రాహ్మణుల గోవుల్ని బలవంతంగా తీసుకెళ్ళారు. క్షత్రియులను హతమార్చడం ద్వారా బ్రాహ్మణాధిపత్యం పునరుద్ధరించాడు పరశురాముడు. మహాభారత యుద్ధం క్షత్రియుల నందరినీ హతమార్చింది. పరశురాముడు సాధింపలేనిది యీ యుద్ధం సాధించింది. బ్రాహ్మణాధిపత్యం ఏర్పడి, క్షత్రియులు కింది స్థానానికి వచ్చారు.

అప్పటి నుండీ బ్రాహ్మణులు వివిధ శాఖల్లో నిష్ణాతులయ్యారు. ముక్తి భావన వచ్చింది. వేద యజ్ఞాలు దేవతలు వృధా అని అన్యయ ఉపనిషత్తులు ఆ విమర్శ నుండి బ్రహ్మ సిద్ధాంతం, ఆధ్యాత్మిక చింతన ఆవిర్భవించాయి. బహుదేవతారాధన క్షీణించింది. సమాజ పరిస్థితులు కూడా

యజ్ఞాలకు అనుకూలించలేదు. వేదాలలోనే ఈ బలహీనతలున్నవి. వేదేతరుల ప్రభావం వలన కూడా ఆర్యులు చాలా మారారు. వేదమార్గంలో స్థిరపడిన సమాజంలో బుద్ధి జాడ్యం వచ్చింది. సమాజంలో వివేచనా పరులు వేద సంప్రదాయాల్ని నిశితంగా పరిశీలించనారంభించారు. పాత భావాలు, పాత దేవతలు పోయి కొత్త ఆలోచన వచ్చింది. బ్రహ్మపరిత్యాగం, రాగ ద్వేషాతీతం, ఏకేశ్వరాధన, బహుదేవతారాధన - యిత్యాదులన్నీ ఆ సమయంలో వచ్చాయి.

నాటి సమాజిక వ్యవస్థలో యజ్ఞాలు చేయటం, గృహస్థ ధర్మాలు నిర్వహించటం కష్టమయ్యేసరికి, సర్వసంగపరిత్యాగం, అడవుల్లో మునివాసం, ఇట్లాంటివాటికి ఉపనిషత్తులో ప్రాధాన్యత ఏర్పడి, ధ్యాన ప్రాముఖ్యత వచ్చింది. ఈ విచ్ఛిన్నతిలో చాలా గృహవ్యవస్థలు పతనమైనవి. సన్యాసి జీవితం ఆధిక్యత గలదని, ఋషి ఆశ్రమం, సన్యాసి ముఖ్యమని, బ్రహ్మచారి, గృహస్థు ప్రధానం కాదని నమ్మారు.

వేదేతరంగా శైవ సిద్ధాంతం, వైష్ణవమతం, జైనధర్మం, బౌద్ధవాదం వచ్చాయి. పౌరోహిత వర్గాలకు చెందని రాజకుటుంబీకులు యీ విషయాలలో ముందడుగు వేశారు. అనేక కారణాలచే, బ్రాహ్మణాధిపత్యం గల వేద యజ్ఞాలు క్షీణించేసరికి, యీ మతాలు విలసిల్లాయి. ఇది శతాబ్దాల నాటి మాట. అందరి సంక్షేమం కాంక్షించటంలోనే యీ మతాలు వేదమతం కంటె ఆధిక్యత వహించాయి. పుట్టుక, పరిసరాలతో నిమిత్తం లేకుండా మానవుడు అత్యున్నత స్థితికి చేరగలడని చెప్పిన విశ్వమతాలు తొలుత భారతదేశంలోనే జనించాయి. ఆర్యుల సామాజిక వ్యవస్థపై యీ మతాలు తిరుగుబాటు చేశాయి. వేదమతాన్ననుసరించి, మూడు వర్ణాలే పవిత్రమైనవి. ఈ మతధర్మం మద్దత్తుగా శూద్రులు పై వర్ణాల కోసం శ్రమించాలన్నారు. పైగా యిహ సౌకర్యాలన్నీ తాము అట్టిపెట్టుకొని మతాధిక్యత చూపారు. కొత్త విశ్వమతాలవలన కొద్దిమంది ఆధిపత్యత, అధికుల అసౌకర్యం పతనంగాజొచ్చింది.

వేదేతర నాగరిక మతాలలో వైష్ణవ, శైవ సంప్రదాయాలున్నవి. ఉత్తర, పశ్చిమోత్తర భారతావనిలో వీరు ఏకేశ్వరవాదాన్ని ప్రచారం చేశారు. వేదకాలంలో వాసుదేవభక్తి ప్రచారంలో ఉన్నది. మహాభారతంలో నారాయణ మతప్రస్తావన కలదు. కాశ్మీర్ నుండి బెంగాల్ వరకు, హిమాలయాల నుండి రామేశ్వరం వరకూ శివభక్తి కూడా ప్రాధాన్యత వహించింది. ఈ మతాల్లో చాలామంది ప్రముఖులు యజ్ఞం, జంతుబలి, బ్రాహ్మణాధిపత్యతను ఖండించారు. దేవుడొక్కడే అనేవాదాన్ని ప్రచారం చేశారు. భక్తిద్వారా అందరూ దైవసన్నిధి చేరొచ్చన్నారు. నైతిక ప్రవర్తన, భక్తితో ముక్తి లభిస్తుందన్నారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులలో ఎవరైనా ఇది సాధించవచ్చన్నారు.

తొలుత వేదాల్ని వ్యతిరేకించిన వీరు వేద బ్రాహ్మణులను ఆమోదించటంతో వ్యతిరేకత కాస్తా హరించిపోయింది. వేద మతంలో వైష్ణవమతం కలిసిపోయినప్పుడు భగవద్గీత ఆవిర్భవించింది. ఏకేశ్వరారాధన అంగీకరించిన వారే పురాణ మతాల్ని సృష్టించారు. సమాజంలో విధి వాదనను, అజ్ఞానాన్ని అట్టిపెట్టి తమ స్థితిని కాపాడుకోటానికై జ్యోతిష శాస్త్రం, గ్రహారాధన, కర్మకాండ, యాత్రలు, తెచ్చిపెట్టారు బ్రాహ్మణులు.

ఇక ఉత్తర, తూర్పు విభాగాల్లో వేదేతరంగా వచ్చిన బౌద్ధవాదం, జైనమతం పేర్కొనదగినవి.

ఇవి విశ్వమతాలు. ఎవరైనా సరే, నైతిక ప్రవర్తనతో ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని పొందవచ్చునని ఇవి బోధించాయి. ఇవి వేదాల్ని, దైవాన్ని, యజ్ఞాలను ఎదుర్కొన్న మతాలు. క్షత్రియ పాలకులకు చెందిన శ్రమణులు యీ మతాలకు కారకులు. బ్రాహ్మణాధిపత్యంపై ఆధారపడిన సమాజ విధానాన్ని ఎదుర్కొని మార్చడానికి వీరు తలపడ్డారు.


శ్రమణులు, భిక్కులు భావచ్ఛేదకులని జైన, బౌద్ధ, బ్రాహ్మణాల వలన అవగాహన అవుతుంది. చార్వాకుడు నిశిత ఆలోచనాపరుడు. మహాభారతం ఇతన్ని ఋషిగా పరిగణించింది. శ్రమణ సంస్కృతి తొలుత వేదేతరం. వారి సంఘం ప్రాచీనమైనది. వేదాలలో ఆధిపత్యం వహించిన దోష ఫలితాలను వీరు చవిచూచారు. మహాభారతంలోని నాగరాజు తక్షకుడు శ్రమణుడే. ఆదిపర్వంలోని సర్పయాగాన్ననుసరించి వేద ఆర్యులు నాగాలకు విరోధులనేది స్పష్టం. జైన కథల బట్టి నాగాలు జైన తీర్థంకరుల స్నేహితులని చాలా పర్యాయాలు వారిని నాగాలు కాపాడారని విదితమౌతుంది. బుద్ధుడు ఆటవిక సమాజంలోనే పుట్టాడు. జాతిం, ముండి, తపస, పరివ్రాజక, ఆజీవక యిత్యాదులన్నీ తొలుత వేదేతరంగా వచ్చాయి. ఆ తరువాత వేద ఆర్యులలో వీరికి చోటు లభించింది.

వేద సమాజ విధానం పతనమైనప్పుడు నవ సమాజ నిర్మాణానికై వేదేతర సమాజాలు తలెత్తాయి. పురోహితులపై సమాజం ఆధారపడే విధానాన్ని ఛేదించాలని వీరు తలపెట్టారు. పురోహితుల సుఖాలకు, స్వార్థాలకు ఏర్పరచిన కర్మకాండ, తంతులను ఎదుర్కోవాలనుకున్నారు. ఈ కర్మ కాండలను, వాటిని ప్రోత్సహించే చీడ పురుగులైన పురోహితులను చార్వాకుడు మొదలగు వివేచనా పరులు తీవ్రంగా గర్హించారు.

బ్రాహ్మణులు ఆవులను తదితర ఉపయోగకరమైన జంతువులను చంపి యజ్ఞాలకు, విందులకు వాడేవారు. రాజ్య కలహాల్లో నిమగ్నులైన రాజులు, సమాజాభివృద్ధికి తోడ్పడే వ్యవసాయం, వాణిజ్యం వంటివి పట్టించుకునేవారే కాదు. కనుక వీటన్నిటినీ అదుపులో పెట్టగల సార్వభౌమాధిపత్యం అవసరమైంది. ఉత్పత్తి వర్గాల శ్రమను దోచుకునే తిండిపోతులు విపరీతంగా పెరిగారు. ఉత్పత్తి శక్తులైన శూద్రులు అట్టడుగు వర్ణం గావటం వలన, పాలకులు వీరిని సమర్థించలేదు. ఉత్పత్తి పంపకం గందరగోళమై సమాజం యావత్తూ విచ్ఛిన్న దశకు చేరుకున్నది. అట్లాంటి సామాజిక పరిస్థితులవలన పరిత్యాగం, అదుపు, తృప్తి, మాయ వంటి మతభావాలు వ్యాపించాయి. కోర్కెలను చంపుకోటం, నాశనం అనేవి శాశ్వత సత్యాలుగా పరిగణించే ఆధ్యాత్మిక దృక్పథం జనించింది. వేద సామాజిక విధానం పొందికను, క్రమాన్ని స్థాపించలేకపోయింది.

భౌతిక సంక్షేమం వేద సంప్రదాయంలో పేర్కొనబడినా సమాజ సమస్యలను పరిష్కరించ లేకపోయింది. వేదకాలంలో ఒక దశకు మించి అభివృద్ధి పురోగమనం జరగటానికి వీలు లేదు. భౌతిక ఆదర్శాలుండిన చాలదు. మారుతున్న సమాజ వ్యవస్థలో అభివృద్ధికి దోహదం చేసేటట్లుగా యీ ఆదర్శాలుండాలి. ఆ దృష్టిలో చూస్తే శ్రౌత - స్మార్త సమాజ వ్యవస్థ స్థాణువైపోయింది. అభివృద్ధికి అదొక ఆటంకమైపోయింది. అణగారిపోయిన ఆ వ్యవస్థలో, దుర్భర స్థితి తప్ప ఇంకేమీ లేవనిపించింది. అంతా దుఃఖమయమని ఏక కంఠంతో కపిలుడు, బుద్ధుడు, జైనులు చాటారు.

(సశేషం)



"శ్రమ జీవులు" చిత్రకారుడు: వుడయార్

MISIMI/ మిసిమి RNI Regd. No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD/191.



"మమత"

చిత్రకారుడు: వుడయార్